SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 329 | ఎడిటర్ : అలీ ముర్తుజా | మంగళవారం 27 అక్టోబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

ఐదు దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల సాగునీటి కలకు ఎట్టకేలకు మోక్షం లభించే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ముంబై వేదికగా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జరిపిన ఉన్నతస్థాయి చర్చలు సత్ఫలితాలనిచ్చాయి. తమ రాష్ట్రానికి నష్టం లేకుంటే పాత ఒప్పందాన్ని సవరించేందుకు సిద్ధమేనని ఫడ్నవీస్ భరోసా ఇవ్వడంతో పాటు.. క్షేత్రస్థాయి అధ్యయనానికి రెండు రాష్ట్రాల అధికారులతో ఉమ్మడి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం ప్రాజెక్టు సాధనలో చారిత్రక పరిణామంగా మారింది.



# 'తుమ్మిడిహెట్టి'కి లైన్ క్లియర్!

152 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తేనే ఆదిలాబాద్‌కు ప్రయోజనమన్న తెలంగాణ

బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర సానుకూలం

నష్టం లేకుంటే అభ్యంతరం లేదన్న దేవేంద్ర ఫడ్నవీస్

ముంబై భేటీలో ఫలించిన సీఎం రేవంత్ బృందం చర్చలు

మహారాష్ట్ర నిబంధనల ప్రకారమే ముంపు పరిహారం

అధ్యయనం కోసం రెండు రాష్ట్రాల అధికారులతో జాయింట్ కమిటీ ఏర్పాటు

**ముంబై, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించారు. సమావేశం ప్రారంభంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

మిగతా 2 లో



## బ్రిక్స్ వేదికపై తెలంగాణ గొంతుక!

- ఢిల్లీలో బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం భేటీ
- హాజరైన స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా

2

## గ్రావిటీతో నీళ్లు తెస్తే.. రాజీనామా!

సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ ఫెయిల్

- కేసీఆర్‌కు పేరు వస్తుందనే మోటార్లు ఆపారు: హరీశ్‌రావు
- ఆయకట్టు లేని తుమ్మిడిహెట్టిపై రూ.25 వేల కోట్ల ఖర్చెందుకు?
- మంత్రి ఉత్తమ్‌కు ఓపెన్ ఛాలెంజ్.. రాజీనామాకు సిద్ధమా?

2



తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం అసాధ్యమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకురాగలిగితే తాను తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఒకవేళ తేలేకపోతే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమా? అని ఆయన బహిరంగ సవాల్ విసిరారు.

## వడ్లకు రికార్డు ధర.. క్వింటాల్ రూ.5,016!



కేసముద్రం మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకానికి ఆల్ టైమ్ రికార్డ్

బహిరంగ మార్కెట్లో సన్నాలకు రూ.3,000-3,500

సర్కార్ మద్దతు ధరను దాటేసిన వడ్ల రేటు

రిటైల్ మార్కెట్‌లో కిలో సన్న బియ్యం రూ.90-100

.. వివరాలు 3లో



## ఆ మాట మోదీతో చెప్పండి

వ్యాపారులకు రాహుల్ సూచన

.. వివరాలు 4లో



## ఢిల్లీలో నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

రాష్ట్రపతి భవన్ సమీపంలో చెలరేగిన మంటలు

.. వివరాలు 4లో



## ఖర్గే వ్యాఖ్యల దుమారం

దేశవ్యాప్తంగా బీజేపీ నిరసనలు

ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో భగ్గుమన్న కమలనాథులు

.. వివరాలు 4లో

## కొమురం భీం పోరాటం చిరస్మరణీయం

జోడేఘాట్‌లో ఘన నివాళులు అర్పించిన మంత్రులు

బడ్జెట్‌లో గిరిజనాభివృద్ధికి నిధులు: మంత్రి అడ్లూరి

ఆత్మగౌరవానికి ప్రతీక భీం: మంత్రి దనసరి సీతక్క



వివరాలు 3లో..



## నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?

సొంత సర్కార్‌పై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్

30 వేల మందితో ఆమరణ దీక్షకు దిగుతా

జడ్చర్ల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్

3

## ఏఈఈ అభ్యర్థులకు టీజీపీఎస్సీ ఊరట!

ఎస్ఎస్‌సీ జేఈ క్లాష్‌తో వెసులుబాటు

నవంబర్ 7న ఏఈఈ పరీక్షకు ఛాన్స్

3

## సిరిసిల్ల ఆస్పత్రికి కేటీఆర్ భరోసా!

రూ.30 లక్షలతో వైద్య పరికరాల అందజేత

- సీఎస్ఆర్ నిధులతో కేటీఆర్ ప్రత్యేక చొరవ
- ఎన్‌హెచ్ఎం సిబ్బంది పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు
- అసెంబ్లీలో సమస్యలపై గళమెత్తుతామని హామీ

వివరాలు 3లో..



# గ్రావిటీతో నీళ్లు తెస్తే.. నా పదవికి రాజీనామా!

**సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ ఫెయిల్**

**కేసీఆర్‌కు పేరు వస్తుందనే మోటార్లు ఆపారు: హరీశ్‌రావు**

**ఆయకట్టు లేని తుమ్మిడిహెట్టిపై రూ.25 వేల కోట్ల ఖర్చెందుకు?**

**మంత్రి ఉత్తమ్‌కు ఓపెన్ ఛాలెంజ్.. రాజీనామాకు సిద్ధమా?**

**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** రాష్ట్రంలో సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నా, తాగు, సాగునీటి అవసరాలపై సర్కార్ కనీస శ్రద్ధ



చూపడం లేదని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా నీటిని సమర్థంగా తరలిస్తుంటే, తెలంగాణలో దేవాదుల నుంచి నీటిని ఎందుకు ఎత్తలేకపోయారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. దేవాదుల ప్రాజెక్టును సక్రమంగా నిర్వహించి ఉంటే వరంగల్, కరీంనగర్ జిల్లాల రైతులు ఇబ్బందులు పడేవారు కాదని హరీశ్‌రావు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులను వినియోగించడంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే దురుద్దేశంతోనే కన్నెపల్లి మోటార్లను ఆన్ చేయలేదని విమర్శించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారని, గతంలో ప్రాణహితఉచేవెళ్ల ప్రాజెక్టును దెబ్బతీసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన దుయ్యబట్టారు.

**తుమ్మిడిహెట్టికి నీళ్లెక్కడివి? ఉత్తమ్ సిద్ధమా?**

అధికారంలోకి వచ్చిన 1,054 రోజుల తర్వాత మహారాష్ట్రతో చర్చలకు వెళ్లడం విడ్డూరంగా ఉందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద తెలంగాణ వినియోగానికి తగిన నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని, కానీ ఆయకట్టు లేని ప్రాజెక్టు కోసం ఏకంగా రూ.25 వేల కోట్లు ఖర్చు చేయడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం అసాధ్యమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకురాగలిగితే తాను తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఒకవేళ తేలేకపోతే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమా? అని ఆయన బహిరంగ సవాల్ విసిరారు.

# 'తుమ్మిడిహెట్టి'కి లైన్ క్లియర్!



(మొదటి పేజీ తరువాయి..)

ద్వారా తుమ్మిడిహెట్టి ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, గిరిజనుల ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం వల్లే గతంలో నక్సలిజం లాంటి సమస్యలు తలెత్తాయన్నారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975లో నాటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి నేటిదాకా జరిగిన ప్రయత్నాలను వివరించారు. 2016లో బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరినా.. ఆ ఎత్తుతో తెలంగాణ అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని స్పష్టం చేశారు. విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా గ్రావిటీ ద్వారా నీటిని తరలించాల్సి ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమని వివరించారు. బ్యారేజీ ఎత్తు పెంపు వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు అక్కడి భూసేకరణ నిబంధనల ప్రకారమే పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు.

**ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం**

హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు హాజరుకావాలని మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, కచ్చితంగా హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని ఆయన బదులిచ్చారు.

**కొమురం భీమ్ ఆకాంక్షలు నెరవేరాలి: సీఎం రేవంత్**

రెండు రాష్ట్రాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని, అక్కడి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఫడ్నవీస్ దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని ఆయన గుర్తు చేశారు. నాటినుంచి సాగు, తాగునీటి కోసం ఎదురుచూస్తున్న ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయం అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు భారీ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధి అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు.

**అధ్యయనానికి అధికారుల కమిటీ: ఫడ్నవీస్**

తెలంగాణ ప్రతిపాదనలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని చెబుతూ.. తెలంగాణతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పునఃసమీక్షించేందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. కేంద్ర జల సంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేస్తుందని సూచించారు. స్నేహభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందామని ఆయన పేర్కొన్నారు.

# బ్రిక్స్ వేదికపై తెలంగాణ గొంతుక!

- ఢిల్లీలో 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం భేటీ
- హాజరైన స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా
- రాష్ట్ర ప్రగతిని వివరిస్తామన్న స్పీకర్ ప్రసాద్ కుమార్



**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** ఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక బ్రిక్స్ సమావేశాల్లో తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతితో పాటు తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలను ఈ అంతర్జాతీయ వేదికపై సవివరంగా వివరిస్తామని ఆయన తెలిపారు. ఢిల్లీలోని సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్ భవనం)లో శని, ఆదివారాల్లో (26, 27 తేదీల్లో) జరుగుతున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ నుంచి స్పీకర్‌తో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు సైతం ఈ కీలక సమావేశాలకు హాజరయ్యారు.

అంతకుముందు ఈ బ్రిక్స్ సమావేశాలకు హాజరయ్యేందుకు ప్రసాద్‌కుమార్, గుత్తా సుఖేందర్‌రెడ్డిలు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టులో స్పీకర్ ప్రసాద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కాగా, స్పీకర్ ఢిల్లీ పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా వాల్మీకి జయంతి!

**డీజీపీ కార్యాలయంలో వేడుకల నిర్వహణ**

**మహర్షి చిత్రపటానికి అధికారుల నివాళులు**

**పాల్గొన్న డీజీ మహేష్ భగవత్, ఇతర సిబ్బంది**



**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** డీజీపీ కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పోలీసు అధికారులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, భారతీయ సాహిత్యానికి, ఆధ్యాత్మికతకు ఆయన అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. చెడు నుంచి సన్మార్గం వైపు పయనించి సమాజానికి మానవతా విలువలను చాటిచెప్పిన ఆయన జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, ఏఐజీ (అడ్మిన్) జె.అన్వోన్య, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వర రావు, పేషీ డీఎస్పీ భాస్కర్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కుమ్రం భీమ్ ఆశయాలు సాధించాలి!

**నివాళులర్పించిన ప్రత్యేక కార్యదర్శి సంతోష్**

**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** కుమ్రం భీమ్ వర్ధంతిని (మంగళవారం) పురస్కరించుకుని హైదరాబాద్‌లోని నెహ్రూ శతజయంతి గిరిజన మ్యూజియంలో సోమవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.



ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి, సంచాలకుడు సంతోష్ బి.ఎం ముఖ్య అతిథిగా హాజరై.. భీమ్ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. జల్, జంగల్, జమీన్ కోసం ఆయన చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన పోరాట స్ఫూర్తితోనే నేటి ప్రభుత్వాలు గిరిజన సంక్షేమం కోసం కృషి చేస్తున్నాయని సంతోష్ చెప్పారు. గిరిజన బాలబాలికలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సదుపాయాలు, కనీస మౌలిక వసతులు కల్పించడం ద్వారానే కుమ్రం భీమ్ ఆశయాలను నెరవేర్చగలమని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధన దిశగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకుడు వి.సర్వేశ్వర రెడ్డి, టీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ వి.సముజ్వల, మ్యూజియం సంరక్షకుడు డాక్టర్ సత్యనారాయణ ద్యావనపల్లి, సీఈ బాలు, ఎస్సీ హేమలత, సహ సంచాలకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



# మహిళలకు 'మహాలక్ష్మి' వరం!

**రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్న వనితలు**

**28 నెలల్లో 290 కోట్ల ఉచిత ప్రయాణాలు**

**రోజూ 35 లక్షల మందికి ఉచిత ప్రయాణం**

**98 శాతానికి చేరిన బస్సుల ఆక్యుపెన్సీ రేటు**

**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూర్చింది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు ఏకంగా రూ.10 వేల కోట్లకు పైగా ఆదా చేసుకున్నట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి సుమారు 28 నెలల కాలంలో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదైనట్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. దీంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా గతంలో ఉన్న 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో బస్సుల ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి ఏకంగా 98 శాతానికి చేరుకోవడం గమనార్హం.

**మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించినట్లు ప్రభుత్వం గుర్తుచేసింది. ఈ పథకం ద్వారా మహిళల రోజువారీ రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గాయని పేర్కొంది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణానికి మాత్రమే పరిమితం కాదని, మహిళల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, స్వావలంబనకు ప్రతీక అని అభివర్ణించారు. విద్య, ఉపాధి కోసం మహిళలు ఆర్థిక భారం లేకుండా ప్రయాణించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతోందని తెలిపారు. కాగా, పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు చేపడుతోందని సీఎం వెల్లడించారు.



# ఇన్‌స్టాలో వల.. నకిలీ 'మూన్ బేబీ' లీలలు!

- అమ్మాయి పేరుతో ఫేక్ ప్రొఫైల్ సృష్టి
- డాక్టర్లు, పోలీసులు సహా విదేశీయులకూ ఎర
- బీటెక్ విద్యార్థిపై లైంగిక దాడి, బ్లాక్‌మెయిల్
- నిందితుడు పవన్‌కుమార్‌పై దర్యాప్తు ముమ్మరం

**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** సైదాబాద్ పరిధిలో వెలుగుచూసిన హనీట్రాప్ కేసు విచారణలో నిందితుడు పవన్ కుమార్ ఆగడాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో 'వీశీశీఅ ఋఎఎ 5973' పేరుతో అమ్మాయిగా నకిలీ ప్రొఫైల్ సృష్టించి దేశవిదేశాల్లోని యువకులకు వల వేసినట్లు పోలీసుల కస్టడీలో వెల్లడైంది. మల్లారెడ్డి కాలేజీకి చెందిన ఓ బీటెక్ విద్యార్థికి దగ్గరై అతడిపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా, తన మాట వినకపోతే ఆత్మహత్య చేసుకుని కేసులో ఇరికిస్తానని బెదిరించినట్లు విచారణలో తేలింది.

**దేశాలు దాటిన మోసాలు..**

నిందితుడి ఫోన్, సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించగా ఈ మోసాల వల తెలుగు రాష్ట్రాలకే కాకుండా కర్ణాటక, కేరళ, తమిళనాడు సహా పాకిస్థాన్, టర్కీ, కెనడా వంటి దేశాలకూ విస్తరించినట్లు వెల్లడైంది. ఇతడి వలలో చిక్కుకున్న వారిలో వైద్యులు, పోలీసు సిబ్బంది, వ్యాపారవేత్తలు, లెక్చరర్లు, డెలివరీ బాయ్స్ కూడా ఉండటం గమనార్హం.

**ప్రైవేట్ వీడియోలతో బెదిరింపులు..**

మాయమాటలతో పరిచయాలు పెంచుకుని ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు సేకరించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ నిందితుడు భారీగా డబ్బు వసూలు చేసినట్లు ఆధారాలు లభించాయి. కొన్ని వీడియోలను ఇతర ఖాతాల్లోనూ అప్‌లోడ్ చేశాడు. గతంలో కపిల్ చిట్ ఫండ్స్‌లో పనిచేసినప్పుడు రుణాల పేరుతో ఓ సహోద్యోగిని సైతం మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసులో ఇంకెంతమంది బాధితులు ఉన్నారనే కోణంలో సైదాబాద్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కొమురం భీం పోరాటం చిరస్మరణీయం!

- జోడేఘాట్‌లో అమరుడు భీమ్‌కు ఘన నివాళులు అర్పించిన మంత్రులు
- ఐటీడీఏలకు పూర్వ వైభవం.. బడ్జెట్‌లో గిరిజనాభివృద్ధికి నిధులు: మంత్రి అడ్లూరి
- ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక కొమురం భీం: మంత్రి దనసరి సీతక్క

## జల్, జంగల్, జమీన్ ఆశయ సాధనకు సమష్టిగా కృషి చేయాలి



**కెరమెరి, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం పోరాడిన అమరుడు కొమురం భీం త్యాగం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మహిళాఉశిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క కొనియాడారు. సోమవారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించిన కొమురం భీం 86వ వర్ధంతి కార్యక్రమంలో మంత్రులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం కొమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాబోయే బడ్జెట్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించేలా చూస్తామన్నారు. గిరిజన జీవోల అమలుకు త్వరలో పూర్తి స్థాయి అధికారిక ఉత్తర్వులు జారీ చేసే బాధ్యతను గిరిజన సంక్షేమ శాఖ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఐటీడీఏలకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. సరిహద్దు మహారాష్ట్ర ప్రాంతాల్లో ఆదివాసీలు, గిరిజనులకు అందుతున్న సంక్షేమ ప్రయోజనాలను అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీని పంపిస్తామని తెలిపారు.

### మెరుగైన వైద్య సేవలకు ప్రాధాన్యం..

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరీత మాట్లాడుతూ.. ప్రతి గిరిజన గ్రామానికి నిరంతరం తాగునీరు అందించేందుకు కెరమెరి సమీపంలో రూ.60 కోట్లతో ఇంటెక్‌వెల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఎస్పీ నిఖితా పంత్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరందు గోండి భాషలో ప్రసంగించి గిరిజన ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రులు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అందజేశారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్, వెడ్మా బొజ్జు పటేల్, భీం మనుమడు కొమురం సోనే రావు, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అధికారులు మానవత్వంతో వ్యవహరించాలి: సీతక్క

మంత్రి దనసరి సీతక్క మాట్లాడుతూ, జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన వీరుడు కొమురం భీం ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అధికారులు మానవత్వంతో, అంకితభావంతో వ్యవహరించాలని, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. యువత విద్యపై దృష్టి సారించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ జిల్లాలో సుమారు 8 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, గిరిజన ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి రూ.5 కోట్లు, రహదారుల అభివృద్ధికి రూ.180 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు గిరిజనులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు.

# వడ్లకు రికార్డు ధర.. క్వింటాల్ రూ.5,016!

- కేసముద్రం మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకానికి ఆల్ టైమ్ రికార్డ్
- బహిరంగ మార్కెట్లో సన్నాలకు రూ.3,000-3,500
- సర్కార్ మద్దతు ధరను దాటేసిన వడ్ల రేటు
- రిటైల్ మార్కెట్‌లో కిలో సన్న బియ్యం రూ.90-100



**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో కళ్లుచెదిరే ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం 'జై శ్రీరామ్' రకం ధాన్యం క్వింటాలుకు ఏకంగా రూ.5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోనూ సన్న రకం ధాన్యానికి రూ.3,000 నుంచి రూ.3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గినట్లు అంచనాలున్నాయి. ఎల్‌నినో ప్రభావం ఆందోళనలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి ప్రైవేటు వ్యాపారులు, రైస్ మిల్లర్లు కొనుగోలుకు ఆసక్తి చూపుతుండటం రేట్ల పెరుగుదలకు కారణమైంది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్‌లో పోటీ పెరిగి ధరలు ఎగబాకుతున్నాయి. 'జై శ్రీరామ్'తో పాటు ఆర్ఎన్ఆర్ లాంటి సన్న రకాలకూ క్వింటాలుకు రూ.4,300 వరకు ధర పలుకుతోంది. ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461 మద్దతు ధర ప్రకటించింది. ఎంపిక చేసిన ఏడు సన్న రకాలపై రూ.500 బోనస్ కలిపినా రైతుకు గరిష్ఠంగా రూ.2,961 మాత్రమే అందుతుంది. అయితే బహిరంగ మార్కెట్‌లో ధర రూ.3,500 పైనే పలుకుతుండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రజా పంపిణీ వ్యవస్థకు (రేషన్) అవసరమైన సన్న బియ్యాన్ని సేకరించడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. ధాన్యం ధరలు పెరగడం రైతులకు లాభదాయకంగా ఉన్నా, బియ్యం కొనుగోలు చేసే సామాన్య వినియోగదారులపై మాత్రం తీవ్ర భారం పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న బియ్యం ధర కిలో రూ.90 నుంచి రూ.100 వరకు చేరింది. కాగా, సన్న వడ్ల సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చినా.. ఇప్పుడు రైతులకు మేలు జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో కోతలు పూర్తయి ధాన్యం సరఫరా పెరిగితే ధరలు ఎలా మారుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# సిరిసిల్ల ఆస్పత్రికి కేటీఆర్ భరోసా!

- రూ.30 లక్షలతో వైద్య పరికరాల అందజేత
- సీఎస్ఆర్ నిధులతో కేటీఆర్ ప్రత్యేక చొరవ
- ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు
- అసెంబ్లీలో మీ సమస్యలపై గళమెత్తుతామని హామీ



**సిరిసిల్ల, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా దాదాపు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలు సమకూరాయి. ఈ పరికరాలను ఆయన సోమవారం ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దవాఖానకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేటీఆర్ ఈ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల దవాఖానలో వైద్య సదుపాయాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ దవాఖానల నిర్వహణ, గతంలో కల్పించిన సదుపాయాల పరిరక్షణపై నిర్లక్ష్యం చూపుతోంది. ఈ నేపథ్యంలో హాస్పిటల్‌కు వచ్చే రోగుల అవసరాలను గుర్తించి సీఎస్ఆర్ నిధుల ద్వారా సుమారు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. వైద్య పరికరాలను సమర్థవంతంగా వినియోగిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని స్థానికులు ఆశిస్తున్నారు.

### ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి బీఆర్ఎస్ మద్దతు..

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు రెండు వారాలుగా తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు, నిరసనలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో జిల్లాలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడిన ఆయన.. కరోనా సమయంలో సిబ్బంది అందించిన సేవలను అభినందించారు. ఉద్యోగుల డిమాండ్లు న్యాయబద్ధమైనవేనని పేర్కొంటూ వారి పోరాటానికి బీఆర్ఎస్ నైతిక మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పీఆర్సీ ప్రయోజనాలు కల్పించామని గుర్తు చేశారు. ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర కమిటీ నాయకుల డిమాండ్ల అంశాలు పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చించి పరిష్కారం కోసం బీఆర్ఎస్ తరఫున ఏం చేయగలమో స్పష్టంగా తెలియజేస్తామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులు తమ పోరాటాన్ని కొనసాగించాలని, ప్రభుత్వం స్పందించేలా ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలను వివరించాలని కేటీఆర్ సూచించారు.

# నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?

- సొంత సర్కార్‌పై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్
- మంత్రుల నియోజకవర్గాలకే నిధులు ఇస్తారా?
- 30 వేల మందితో ఆమరణ దీక్షకు దిగుతా
- జడ్చర్ల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్



**మహబూబ్‌నగర్, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** తెలంగాణలో సొంత కాంగ్రెస్ ప్రభుత్వంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పనులు పూర్తయినా బిల్లులు విడుదల చేయకపోవడంపై ఆయన మండిపడ్డారు. తనకు రావాల్సిన బిల్లుల కోసం తాను చనిపోవాల్సిందేనా అని నిలదీశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు.

### మంత్రుల నియోజకవర్గాలకేనా?

అనిరుధ్‌రెడ్డి సోమవారం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, గుండ్లపొట్లపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రుల నియోజకవర్గాల్లోనే బిల్లులు చెల్లిస్తారా? మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ చనిపోతే వెంటనే రూ.5 కోట్ల బిల్లు మంజూరు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తన నియోజకవర్గంలో బిల్లులు రావాలంటే తాను కూడా ప్రాణాలు కోల్పోవాలా అని అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పూర్తయిన పనులతో పాటు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి చేసినప్పుడే ప్రభుత్వం నిలదొక్కుకుంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. జడ్చర్లకు సాగునీరు అందించే విషయంలో పార్టీలకు అతీతంగా పోరాడతానని, రైతుల ప్రయోజనాల కోసం ఎంతదూరమైనా వెళతానని తేల్చిచెప్పారు. పెండింగ్ బిల్లుల విడుదలతో పాటు నియోజకవర్గానికి రావాల్సిన నిధులపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని అనిరుధ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# ఏఈఈ అభ్యర్థులకు టీజీపీఎస్సీ ఊరట!

- ఎస్ఎస్‌సీ జేఈ క్లాష్‌తో వెసులుబాటు
- నవంబర్ 7న ఏఈఈ పరీక్షకు ఛాన్స్
- అక్టోబర్ 30లోగా పత్రాల సమర్పణ
- ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు

**హైదరాబాద్ (సమయం న్యూస్):** తెలంగాణలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) భారీ ఊరటనిచ్చింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) జూనియర్ ఇంజనీర్ (జేఈ) పరీక్ష, ఏఈఈ పరీక్ష ఒకే రోజు ఉండటంతో ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులకు ప్రత్యామ్నాయ తేదీని కల్పించింది. నవంబర్ 6న ఎస్ఎస్‌సీ జేఈ పరీక్షకు హాజరుకావాల్సి ఉండి, ఏఈఈ పరీక్షకు కూడా దరఖాస్తు చేసుకున్న అర్హులకు.. నవంబర్ 7న పరీక్ష రాసేందుకు కమిషన్ సదావకాశం కల్పించింది. ఈ వెసులుబాటు పొందాలనుకునే అభ్యర్థులు అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తమకు సంబంధించిన అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. నవంబర్ 6వ తేదీతో ఉన్న ఎస్ఎస్‌సీ జేఈ హాల్‌టికెట్ కాపీ, ఏఈఈ దరఖాస్తు పత్రం, టీజీపీఎస్సీ వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) ఐడీ తదితర వివరాలను అందించాలి. ఈ పత్రాలను కమిషన్ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌లో నేరుగా అందజేయవచ్చు. లేదా ష్టవశ్రీజూసవంఎవ్‌స్త్రజూం‌ఎ.స్త్రశీజ.ఱఅ ఈమెయిల్ చిరునామాకు కూడా పంపించే వీలుందని కమిషన్ తెలిపింది.

### అర్హులైన వారికే అవకాశం..

అభ్యర్థులు సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత అర్హులైన వారికే నవంబర్ 7న ఏఈఈ పరీక్ష రాసేందుకు అనుమతి లభిస్తుంది. నవంబర్ 6న ఎస్ఎస్‌సీ జేఈ పరీక్షకు హాజరుకావాల్సి ఉండి, ఏఈఈ పరీక్షకు కూడా దరఖాస్తు చేసుకున్నవారికే ఈ అవకాశం వర్తిస్తుంది. ఎస్ఎస్‌సీ జేఈ (సివిల్) పరీక్షలు నవంబర్ 2 నుంచి 6 వరకు, టీజీపీఎస్సీ ఏఈఈ (సివిల్) పరీక్షలు నవంబర్ 6, 7 తేదీల్లో జరగనున్నాయి. రెండు పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తేదీల పరంగా ఎదురైన తీవ్ర ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న టీజీపీఎస్సీ ఈ నిర్ణయం తీసుకుంది. కాబట్టి అర్హులైన అభ్యర్థులు గడువులోగా పత్రాలు సమర్పించుకోవాలని సూచించింది.

# ఖర్గే భాష విచారకరం!

### ప్రధానిపై వ్యాఖ్యలను ఖండించిన రాంచందర్‌రావు



**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా ఖండించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత నుంచి ఇలాంటి భాష రావడం అత్యంత విచారకరమని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దశాబ్దానికి పైగా అధికారానికి దూరంగా ఉండటంతో తీవ్ర అసహనానికి గురవుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత పన్నెండున్నరేళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో నిరాశ పెరిగిపోయిందని ఆరోపించారు. ఆ అసంతృప్తితోనే మోదీ కుటుంబాన్ని ఉద్దేశించి ఖర్గే అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఖర్గే ప్రసంగించిన సభలో వేదికపై ఉన్న నేతల సంఖ్యతో పోలిస్తే ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఎద్దేవా చేశారు. బిహార్ రాజధాని పాట్నాలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఖర్గే ప్రసంగిస్తుండగా, మోదీ ఓడిపోరంటూ ఓ వ్యక్తి నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' అంటూ వ్యాఖ్యానించడం వివాదానికి దారితీసింది. ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు చేయడంతో రెండు పార్టీల మధ్య రాజకీయ విమర్శలు మరింత తీవ్రమయ్యాయి.

## సంపాదకీయం



# భారీ యుద్ధాల కోసం 'కోట' కడుతోన్న అమెరికా!

**యుద్ధ వేళల్లో 90 రోజుల పాటు స్వతంత్రంగా పనిచేసేలా సైనిక స్థావరాలు**

**విద్యుత్ కోసం పోర్టబుల్ అణు రియాక్టర్లు, భారీ బ్యాటరీ వ్యవస్థలు**

**రక్షణ రంగ తయారీకి పౌర ఫ్యాక్టరీల వినియోగం**

పశ్చిమాసియాతో పాటు ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణలు అంతర్జాతీయంగా ఆందోళనలను పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో భారీ యుద్ధాలు తలెత్తినా, తన భూభాగాన్ని రక్షించుకోవడంతో పాటు సైనిక కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అమెరికా సన్నద్ధమవుతోంది. యుద్ధ సమయాల్లో సరఫరా గొలుసులు, పౌర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నప్పటికీ సైనిక స్థావరాలు కనీసం 90 రోజుల పాటు స్వతంత్రంగా పనిచేసేలా 'ఫోర్ట్రెస్' పేరుతో ఓ ప్రణాళికను అమలు చేసేందుకు పెంటగాన్ చర్యలు వేగవంతం చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ ఓ కథనాన్ని ప్రచురించింది. దేశ రక్షణ కోసం సాధారణ పౌర మౌలిక సదు-పాయాలపై ఆధారపడటం ప్రమాదకరమని పెంటగాన్ ముఖ్య అధికార ప్రతినిధి సీన్ పార్నెల్ పేర్కొన్నట్లు ఆ కథనం వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్తు అత్యంత కీలకంగా మారిందని, విద్యుత్ సరఫరా నిలిచిపోతే సమాచార వ్యవస్థలతో పాటు రవాణా సదుపాయాలపైనా ప్రభావం పడుతుందని ఆయన వివరించినట్లు తెలిపింది. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకే 'ఫోర్ట్రెస్' ప్రణాళికను రూపొందిస్తున్నట్లు పేర్కొంది. అమెరికా భూభాగ రక్షణకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త విధానాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, 'గోల్డెన్ డోమ్', 'ఫోర్ట్రెస్' ప్రణాళికలు అందులో భాగమని పార్నెల్ వెల్లడించినట్లు కథనం పేర్కొంది. 'ఫోర్ట్రెస్' ప్రణాళికలో భాగంగా అమెరికా వ్యాప్తంగా కీలక సైనిక స్థావరాలను మరింత స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కనీసం 90 రోజుల పాటు బయటి సరఫరాలపై ఆధారపడకుండా కీలక కార్యకలాపాలను కొనసాగించేలా వీటిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం పోర్టబుల్ అణు రియాక్టర్లు, భారీ సామర్థ్యం కలిగిన బ్యాటరీ వ్యవస్థలు, స్థానికంగా విద్యుత్ ఉత్పత్తి చేసి పంపిణీ చేయగల మైక్రోగ్రిడ్‌లను వినియోగించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. యుద్ధ సమయంలో ఆయుధాలు, ఇంధనం, వైద్య సామగ్రి, కీలక ఖనిజాలు, విడిభాగాల కొరత ఏర్పడినా సైనిక కార్యకలాపాలు ఆగిపోకుండా ఏర్పాట్లు చేయడం ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. సరఫరా మార్గాలు దెబ్బతిన్నా, విద్యుత్ వ్యవస్థలు నిలిచిపోయినా సైనిక స్థావరాలు తమ కార్యకలాపాలను కొనసాగించే సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో రక్షణ రంగానికి అవసరమైన వస్తువులను తయారు చేసేందుకు పౌర పరిశ్రమలను కూడా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ఫ్యాక్టరీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, అవసరమైన సాంకేతిక మార్పులు చేయడం, సైబర్ భద్రతను బలోపేతం చేయడం వంటి అంశాలపై పెంటగాన్ దృష్టి సారించినట్లు కథనం పేర్కొంది. యుద్ధ పరిస్థితుల్లో సైనిక సామర్థ్యం కేవలం ఆయుధాలకే పరిమితం కాదని, విద్యుత్, ఇంధనం, సమాచార వ్యవస్థలు, వైద్య సేవలు, పారిశ్రామిక ఉత్పత్తి వంటి రంగాలూ కీలక పాత్ర పోషిస్తాయని అమెరికా భావిస్తున్నట్లు ఈ ప్రణాళిక సూచిస్తోంది. అయితే 'ఫోర్ట్రెస్' ప్రణాళికకు సంబంధించిన పూర్తి అమలు వివరాలు, స్థావరాల ఎంపిక, నిధుల కేటాయింపు, గడువులపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# ఢిల్లీలో నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

**రాష్ట్రపతి భవన్ సమీపంలో చెలరేగిన మంటలు**

**దట్టమైన పొగలు వ్యాపించడంతో అప్రమత్తమైన అధికారులు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26:** దేశ రాజధానిలోని అత్యంత కీలకమైన ప్రభుత్వ భవనాల్లో ఒకటైన నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాష్ట్రపతి భవన్‌కు సమీపంలో మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక శాఖ ఆరు వాహనాలను ఘటనా స్థలానికి పంపించింది. పార్లమెంట్‌కు వెళ్తున్న సమయంలో నార్త్ బ్లాక్ వెనుక వైపు నుంచి దట్టమైన పొగలు వెలువడటాన్ని గమనించినట్లు రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవరా తెలిపారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడిస్తూ, అక్కడ అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు. అందరూ క్షేమంగా ఉండాలని, అత్యవసర సేవలు వేగంగా స్పందించాలని ఆకాంక్షించారు. పొగలు కనిపిస్తున్న ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు. ప్రమాద తీవ్రతపై స్పష్టత రావాల్సి ఉంది. మంటలు చెలరేగడానికి గల కారణాలు, అవి అదుపులోకి వచ్చాయా లేదా అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా, భవనానికి ఎంత మేర నష్టం వాటిల్లిందనే అంశాలపై కూడా అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. అగ్నిమాపక సిబ్బంది పరిశీలన అనంతరం మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.



# మోదీతో ఆ మాట చెప్పండి

- 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి!
- వ్యాపారులకు రాహుల్ గాంధీ సూచన..
- 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నవంబరు 1న 'ఇండియా' కూటమి ఆందోళన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26:** 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నవంబరు 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసనను వాయిదా వేయాలని స్థానిక వ్యాపార వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. దీపావళి పండగ సీజన్‌లో ఆందోళన నిర్వహిస్తే తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశాయి. ఈ విజ్ఞప్తిపై రాహుల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరితే నిరసనలు ఆగిపోతాయని వ్యాఖ్యానించారు. "ఢిల్లీలోని ప్రతి వ్యాపారి మాటను వింటున్నాం. వారి సమస్యలను అర్థం చేసుకుంటున్నాం. అయితే మెట్రోలను ప్రభుత్వమే నిలిపివేసింది. రోడ్లనూ మూసివేసింది. దేశ రాజధానిని లాక్‌డౌన్‌లో ఉంచింది. ఓట్లనే చోరీ చేస్తే.. ఇక మీ దుకాణాలు, పొదుపు సొమ్ము, పిల్లల భవిష్యత్తు.. ఏదీ సురక్షితం కాదు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పండి. అప్పుడు 30 సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ఆగిపోతాయి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దీపావళి పండగ సమయంలో ఢిల్లీలో పెద్దఎత్తున వ్యాపార కార్యకలాపాలు జరుగుతాయని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) తెలిపింది. నవంబరు 1న రామ్‌లీలా మైదానంలో నిరసన నిర్వహిస్తే పరిసర ప్రాంతాల్లోని వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిరసన కారణంగా దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారం ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో నవంబరు 10 తర్వాత నిరసనను నిర్వహించాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాసినట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. పండగ సీజన్‌లో



వినియోగదారుల రాకపోకలు, వ్యాపార లావాదేవీలకు ఆటంకం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశాయి. మరోవైపు, ఓటు చోరీ ఆరోపణలపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు.

# అమిత్ షా పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

**ఆరేళ్ల నాటి కేసులో నిర్దోషిగా ప్రకటించిన సుల్తాన్‌పూర్ కోర్టు**

**2018 కర్ణాటక ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యలతో వివాదం**

**సుల్తాన్‌పూర్, అక్టోబర్ 26:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా వెల్లడించారు. తీర్పు వెలువడే సమయంలో రాహుల్ గాంధీ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2018 మే 8న బెంగళూరులో జరిగిన సభలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. అదే ఏడాది ఆగస్టు 4న బీజేపీ నేత, జిల్లా సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు విజయ్ మిశ్రా పరువు నష్టం ఫిర్యాదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని 2023 నవంబర్ 27న కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. 2024 ఫిబ్రవరి 20న కోర్టుకు హాజరైన ఆయనకు బెయిల్ లభించింది. అదే ఏడాది జూలై 26న రాహుల్ వాంగ్మూలాన్ని, అక్టోబర్ 9న ఫిర్యాదుదారు విజయ్ మిశ్రా వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. 2025 ఫిబ్రవరి 28న ఫిర్యాదుదారు తరఫు సాక్షి అనిల్ మిశ్రా వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అదే ఏడాది డిసెంబర్ 8న మరో సాక్షి రామచంద్ర దూబే వాంగ్మూలాన్ని కోర్టు రికార్డు చేసింది. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 20న రాహుల్ గాంధీ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆయన వాయిస్ శాంపిల్స్‌ను సరిపోల్చాలని విజయ్ మిశ్రా దాఖలు చేసిన పిటిషన్‌ను మేజిస్ట్రేట్ కోర్టు మార్చి 12 తర్వాత విచారించి తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, జూలై 15న అక్కడా చుక్కెదురైంది. సెప్టెంబర్ 10న హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ కూడా తిరస్కరణకు గురైంది. అక్టోబర్ 6న కేసులో తుది వాదనలు ప్రారంభమై, అక్టోబర్ 12 నాటికి విచారణ పూర్తయింది. అనంతరం సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించినట్లు ఆయన న్యాయవాది తెలిపారు. దీంతో 2018లో ప్రారంభమైన పరువు నష్టం కేసు సుదీర్ఘ విచారణకు ముగింపు లభించింది.

# ఖర్గే వ్యాఖ్యల దుమారం

**దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల నిరసనలు!**

- ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో భగ్గుమన్న కమలనాథులు
- కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని, క్షమాపణ చెప్పాలని కమలదళం డిమాండ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 26:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రధాని మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఈ వ్యాఖ్యలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శ్రేణులు దేశవ్యాప్తంగా అగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టాయి. ప్రధాని మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఖర్గే వెంటనే తన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని, ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఖర్గే తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలంటూ కమలనాథులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు., ప్రధాని మోదీకి ఖర్గే బహిరంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఆదివారం బిహార్‌లోని పట్నాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మల్లికార్జున ఖర్గే మాట్లాడుతు.. 'మోదీ కాదు.. ఆయన బాబైనా పోవాల్సిందే' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం బిహార్‌లోని పట్నాలో ఓ కార్యక్రమానికి హాజరైన మల్లికార్జున ఖర్గే.. 'మోదీ కాదు.. ఆయన బాబైనా పోవాల్సిందే' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై కాషాయ పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో భగ్గుమన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయాల ఎదుట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయాల్లో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలుచోట్ల ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేయడంతో పాటు, ఆయన పోస్టర్లకు నిప్పంటించి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేశారు. అలాగే ఆయన పోస్టర్లకు నిప్పంటించి, వ్యతిరేక నినాదాలు చేశారు. ముఖ్యంగా బిహార్‌వ్యాప్తంగా కమలనాథులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. బిహార్‌లో కమలనాథులు ఆందోళనలు నిర్వహించి, కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



**విమర్శించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్:**

ఈ వివాదంపై బీజేపీ అగ్ర నాయకులు తీవ్రంగా స్పందించారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా తప్పుపట్టారు. "ఇది అత్యంత బాధాకరమైన విషయం. ఈ మొత్తం వ్యవహారంలో నన్ను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసిన అంశం ఏమిటంటే.. ఈ తరహా చౌకబారు వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని ఏదో చిన్న స్థాయి నాయకుడు చేయలేదు, ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడే చేయడం బాధ్యతారాహిత్యం" అని రాజ్‌నాథ్ సింగ్ తన ఆవేదనను వ్యక్తం చేశారు. 'ఇది చాలా బాధాకరం. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం ఏంటంటే.. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్‌లో చిన్న స్థాయి వ్యక్తి చేయలేదు. ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

# జామియా విద్యార్థుల దీక్షకు పాక్షికంగా తెర

**విద్యార్థి సంఘం ఎన్నికలకు యూనివర్సిటీ అంగీకారం**

**సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసుల ఉపసంహరణకు నిర్ణయం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26:** జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీలో విద్యార్థుల నిరాహార దీక్షకు పాక్షికంగా తెరపడింది. విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన డిమాండ్లపై యూనివర్సిటీ యాజమాన్యం అక్టోబర్ 26, 2026న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం, ఆందోళన సందర్భంగా విధించిన సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవడం, భద్రతా సిబ్బంది వ్యవహారంపై విచారణ చేపట్టడం వంటి నిర్ణయాలను ప్రకటించింది. అయితే, ఎన్నికల పోలింగ్ తేదీ ఖరారు కాకపోవడంతో కొందరు విద్యార్థులు నిరసన కొనసాగిస్తున్నారు. విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌కు యూనివర్సిటీ అంగీకరించింది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.డి. మెహతాబ్ ఆలం రిజ్వీ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, విద్యార్థి సంఘం రాజ్యాంగానికి ఆమోదం లభించిన 15 రోజుల తర్వాత ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ఆ రాజ్యాంగానికి ఎప్పుడు ఆమోదం లభిస్తుందనే దానిపై స్పష్టత లేదు. దీంతో పోలింగ్ తేదీని ఇంకా ప్రకటించలేదు. ఆందోళన సమయంలో విద్యార్థులపై విధించిన సస్పెన్షన్లను రద్దు చేయడంతో పాటు జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని యూనివర్సిటీ నిర్ణయించింది. అదే సమయంలో, యాజమాన్యానికి పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు, చర్యలు, సోషల్ మీడియా పోస్టులపై విద్యార్థులు బహిరంగంగా క్షమాపణ చెప్పేందుకు అంగీకరించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం, సంబంధిత పోస్టులను తొలగించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. విద్యార్థుల నిరసన సమయంలో భద్రతా సిబ్బంది వ్యవహరించిన తీరుపై విచారణ జరిపేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని కూడా యాజమాన్యం నిర్ణయించింది. యూనివర్సిటీ నిర్ణయాలపై కొంతమంది విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, పోలింగ్ తేదీని ఖరారు చేయకపోవడంపై అభ్యంతరం చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గేట్ నంబర్ 7 వద్ద టెంట్లు వేసుకుని నిరసన కొనసాగిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చేవరకు ఆందోళన విరమించబోమని చెబుతున్నారు. విద్యార్థి సంఘం రాజ్యాంగానికి ఆమోదం లభించిన తర్వాతే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన 15 రోజుల గడువు ప్రారంభం కానుంది. దీంతో రాజ్యాంగం ఆమోదం, ఎన్నికల షెడ్యూల్ ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది.

# కన్నీరు పెట్టిస్తున్న రైతన్న కష్టం..

- కరెంటు కోతలతో ఎండిపోతున్న పంటలు.. రైతులను ఆదుకోవాలి
- వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి...మోటూరి రవి



**గురిజాల, అక్టోబర్ 26 (సమయం న్యూస్) :**

వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా లేక బావుల కింద సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు.నర్సంపేట రూరల్ మండలం గురిజాల గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బావుల కింద సాగు చేసిన పంటలను సోమవారం పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి మాట్లాడుతూ గ్రామంలో పలువురు రైతులు వరితో పాటు ఇతర పంటలను సాగు చేశారని తెలిపారు. అయితే, వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందక, నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయానికి ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పంట నష్టంపై సర్వే చేయించి, నష్టపోయిన రైతులను గుర్తించి తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్నపెల్లి నరసింగం, మాజీ ఎంపీటీసీలు గడ్డం కొమురయ్య, బండారి రమేష్, బండారి చిన్న వెంకటేశ్వర్లు, మాజీ రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అల్లి రవి, గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిక దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్రి కుమారస్వామి, యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి సంగం శ్రీకాంత్, సీనియర్ నాయకులు బండారి మల్లయ్య, కొమ్మ రవి, యశోద నర్సింగం, ఆరె సుధాకర్, శ్రీరామోజు మధుకర చారి, పుంజాల సంపత్ పాల్గొన్నారు.

## నూతన జిల్లా యువజన అధికారులకు ఓరియంటేషన్, ఆన్-ది-జాబ్ శిక్షణ






**హైదరాబాద్, అక్టోబర్ 26( సమయం న్యూస్) 2026**

మేరా యువ భారత్ (MY Bharat) తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన మూడవ బ్యాచ్ జిల్లా యువజన అధికారులకు ఒకరోజు ఓరియంటేషన్, ఆన్ దిజాబ్ శిక్షణ కార్యక్రమం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో నిర్వహించారు.తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ వల్లూరు క్రాంతి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో యువతతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకుని, స్థానిక యువజన సంఘాలతో సమన్వయం చేస్తూ యువతను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని ఆమె సూచించారు. యువత ఎదుర్కొంటున్న కెరీర్, ఉపాధి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.మేరా యువ భారత్ తెలంగాణ రాష్ట్ర సంచాలకులు అన్వేష్ చింతాల మాట్లాడుతూ, యువజన అభివృద్ధి కార్యక్రమాల అమలు, యువత సమీకరణ, స్వచ్ఛంద సేవలు, స్థానిక యువజన సంఘాల బలోపేతంలో డీవైఓల పాత్ర కీలకమని పేర్కొన్నారు. వికసిత్ భారత్ @2047 లక్ష్య సాధనలో యువతను భాగస్వాములను చేయాలని సూచించారు.సహాయ సంచాలకులు గంటా రాజేష్ యువత సాధికారత, నాయకత్వ లక్షణాల అభివృద్ధి, దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యంపై వివరించారు. శిక్షణలో అధికారులు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లు, విధి నిర్వహణ అంశాలపై చర్చించారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2026లో భాగంగా అధికారులు నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక విలువలకు కట్టుబడి పనిచేస్తామని విజిలెన్స్ ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ఈ. యాదగిరి, ఎం.వి. సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ ద్వారా నూతన డీవైఓలకు తమ బాధ్యతలు, విధివిధానాలు, జిల్లాల్లో యువజన కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై అవగాహన కల్పించారు.

## మహర్షి వాల్మీకి జీవితం, ఆదర్శాలు సమాజానికి స్ఫూర్తిదాయకం

- మహర్షి వాల్మీకి చూపిన మార్గంలో నడవాలి – జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి సమయం న్యూస్ సంగారెడ్డి, అక్టోబర్ 26:-**

మహర్షి వాల్మీకి జీవితం, ఆదర్శాలు, ఆయన రచించిన రామాయణం సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మానవాళికి ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. ఆయన జీవితం మనిషిలో మార్పు సాధ్యమేనని, పట్టుదల, జ్ఞానం, నిరంతర కృషితో ఉన్నతమైన లక్ష్యాలను సాధించవచ్చని చాటిచెబుతుందన్నారు. మహర్షి వాల్మీకి బోధనలను ఆచరిస్తూ సమాజంలో సద్భావన, సమానత్వం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు



ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, వివిధ శాఖల అధికారులు, వాల్మీకి జయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ బోయ వెంకటేశం, వాల్మీకి బోయ సంఘం ప్రతినిధులు వెంకట రామయ్య, బుచ్చయ్య, సంఘమేష్, ప్రభు, బక్కప్ప, శివరాజ్, శ్రీనివాస్, అనిల్, రాములు, ఆగమయ్య, రాజు, పండరి, జ్ఞానేశ్వర్, దినేష్, టీఎన్జీవో ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

- ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన...
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్



**వికారాబాద్, అక్టోబర్,26(సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురాగా, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి,ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావడంతో పాటు, వారి సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కలుగుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిగణించి, పారదర్శకంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఓట్ బచావో – దేశ్ బచావో ప్రచారాన్ని ప్రజల్లోకి





- ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం: కాంగ్రెస్ నేతల పిలుపు

**బోడుప్పల్, అక్టోబర్ 26 (సమయం):**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఆదేశాల మేరకు 'ఓట్ బచావో - దేశ్ బచావో' ప్రచార కార్యక్రమంపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బోడుప్పల్‌లోని పీఎంజీ గ్రాండ్‌లో జిల్లా స్థాయి విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకుడు మోహన్ కుమార మంగళం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులకు ప్రచార కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. ఓటు హక్కును పరిరక్షించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. 'ఓట్ బచావో - దేశ్ బచావో' నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొల్లాన్ హనుమంత్, సీనియర్ నాయకుడు భూపతి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు, డివిజన్ల అధ్యక్షులుపాల్గొన్నారు.

## మండలఅధ్యక్షుడిగా అయ్యగళ్ల రవి మాదిగ ఎన్నిక

- అధ్యక్షుడిగా అయ్యగళ్ల రవి మాదిగ ఎన్నిక



**రాయపోల్ అక్టోబర్ 26. (సమయం న్యూస్)**

ఎమ్మార్పీఎస్ సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండల అధ్యక్షులుగా రెండోసారి మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన అయ్యగల్ల రవి మాదిగఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముక్క పల్లి రాజు మాదిగ నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు.అధికార ప్రతినిధిగా కొనింటి లక్ష్మణ్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గుండారం ఎల్లం మాదిగ, ఉపాధ్యక్షుడిగా మద్దూరి యాదగిరి మాదిగను ఎన్నుకున్నారు. అలాగే మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షుడిగా తుడుం నర్సింగరావు మాదిగ, అధికార ప్రతినిధిగా శ్రీనివాస్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా రాముల నాగరాజు మాదిగ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఇస్తారి గల్ల ఎల్లం మాదిగ, మైస రాములు, దౌల్తాబాద్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జలంధర్, పుర నరసింహులు మాదిగ, మల్లుగారి యాదగిరి మాదిగ, గజ్వేల్ రామచంద్రం, రామ్మోళ స్వామి, సోమని ఇస్తారి, చిన్న మల్లయ్య. గణేష్, మసన్‌పల్లి రాజు, ఉషనగల్ల శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**సిద్దిపేట, అక్టోబర్ 26:( సమయం న్యూస్)**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రామాయణ రచయిత వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ధర్మబద్ధమైన మార్గంలో నడవాలని సూచించారు. మహనీయుల చరిత్రను నేటి తరం తెలుసుకోవడం అవసరమన్నారు.కార్యక్రమంలో అధికారులు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వాల్మీకి మహర్షి ఆశయాలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్య శారద

**వరంగల్, అక్టోబర్ 26 (సమయం న్యూస్)**

వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.రామాయణ మహాకావ్యాన్ని రచించి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలు, ధర్మమార్గాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని నాగరాజు అన్నారు. సమాజంలో మానవత్వం, సమానత్వం, సోదరభావం పెంపొందించడంలో మహర్షి బోధనలు ఎంతో ప్రాధాన్యాన్ని కలిగి ఉన్నాయని తెలిపారు. వాల్మీకి మహర్షి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ భావి తరాలకు నైతిక విలువలు, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, ప్రజాప్రతినిధులు, అధికారులు, వాల్మీకి సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

**ఖమ్మం, అక్టోబర్ 26:( సమయం న్యూస్)**

నేలకొండపల్లిలోని 3వ శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపాన్ని అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.బౌద్ధ స్తూప అభివృద్ధి, పర్యాటక సదుపాయాల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. పురావస్తు తవ్వకాల్లో లభించిన చారిత్రక వస్తువులను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ మతస్థులను ఆకర్షించేలా నిపుణుల సూచనలతో ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, గొప్ప బౌద్ధ క్షేత్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు.



## టెలికాం పెన్షనర్లకు జీవన్ ప్రమాణ్ క్యాంపులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26( సమయం న్యూస్)**

ఢిల్లీNCRలో టెలికాం పెన్షనర్ల కోసం నవంబర్‌లో జీవన్ ప్రమాణ్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్) క్యాంపులు నిర్వహించనున్నారు.నవంబర్ 3 నుంచి 27 వరకు ఢిల్లీ, గురుగ్రామ్, ఫరీదాబాద్, నోయిడాలోని వివిధ MTNL/BSNL కేంద్రాల్లో క్యాంపులు జరుగుతాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయి.డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్, ఫేస్ ఆథెంటికేషన్ శిక్షణ, KYP ఫారాల సమర్పణ, ఫిర్యాదుల స్వీకరణ వంటి సేవలు అందిస్తారు. ఇప్పటికే లైఫ్ సర్టిఫికేట్ సమర్పించిన వారు మళ్లీ హాజరు కావాల్సిన అవసరం లేదు.

సమయం

www.epaper.samayamdaily.net

## హుస్నాబాద్‌లో 136 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**హుస్నాబాద్అక్టోబర్26( సమయం న్యూస్)**

వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. నియోజకవర్గం లో నేటి నుంచి 136 కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు.రైతులు మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయించ వద్దని, దళారుల చేతిలో మోసపోవద్దని సూచించారు. సన్న ధాన్యం బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఈ నెల 28న అఖిలపక్ష సమావేశం నిర్వహించి, అనంతరం ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి అవసరమైన సహకారం కోరుతామని మంత్రి వెల్లడించారు. రైతుల సంక్షేమం, తాగునీటి భద్రత, వ్యవసాయం, ఉపాధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు



## యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలు

- **సాగు చేయాలి: మంత్రి తుమ్మల**

**ఖమ్మం, అక్టోబర్ 26( సమయం న్యూస్)**

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో యాసంగిలో రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని కోరారు.రఘునాథపాలెం మండలంలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 1,300కు పైగా, రెండో విడతలో 1,100 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.రైతుల పొలాలకు రహదారుల నిర్మాణానికి ఇప్పటికే రూ.75 కోట్లు, త్వరలో మరో రూ.25 కోట్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మల్లేపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, నల్లకుంట చెరువును సందర్శించారు.



## గిరిగామలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం

**ఆదిలాబాద్, అక్టోబర్ 26:( సమయం న్యూస్,)**

తాంసి మండలం గిరిగామలో నిర్వహించిన 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొన్నారు. కొమురం భీమ్‌కు నివాళులర్పించి, ఆదివాసీలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యువతకు హెల్మెట్లు పంపిణీ చేసి, క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేశారు. కప్పర్ల, పొన్నారి, గోట్కూరి గ్రామాల్లో మొత్తం 22 సీసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, గంజాయి సాగు, విక్రయాలు, వినియోగానికి దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఆదివాసీ యువత చదువుపై దృష్టి సారించి ఉన్నత విద్య అభ్యసించాలని కోరారు.డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, సీఐ రహీం పాషా, ఎస్ఐ ఎస్. జీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు పోలీసులకు సహకరించి గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు భాగస్వాములు కావాలని సూచించారు. వైద్యులు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, అవసరమైనప్పుడు అర్హత కలిగిన వైద్యులను సంప్రదించాలని సూచించారు.



## ప్రజావాణికి 11 ఫిర్యాదులు

- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను**

**నారాయణపేట, అక్టోబర్,26(సమయం న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 11 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ ను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



### ఖేత్ బచావో అభియాన్ - సాగు భూమి సంరక్షణ కార్యక్రమం..

**రాయపోల్ అక్టోబర్ 26.సిద్ధిపే జిల్లా**

రాయపోల్ మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "ఖేత్ బచావో అభియాన్ - సాగు భూమి సంరక్షణ కార్యక్రమం" నిర్వహించడం జరిగింది. సాగు భూమి సంరక్షణతో పాటు సాగునీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి రైతు బాధ్యత అని, వ్యవసాయంలో అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సహజ స్వభావం దెబ్బతినడంతో పాటు భూసారం తగ్గే ప్రమాదం ఉందని వివరించటం జరిగింది. అధిక రసాయనాల వినియోగం వల్ల నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులపై ప్రతికూల ప్రభావం పడుతుందని, పర్యావరణానికి కూడా నష్టం కలిగే అవకాశం ఉందని,రైతులు భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలని, పురుగు మందులను అవసరమైనప్పుడు మాత్రమే సిఫార్సు చేసిన మోతాదులో ఉపయోగించాలని, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుతూ, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సాగునీటిని వృథా చేయకుండా సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు వివరించటం జరిగింది.ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి గ్రామ సర్పంచ్ రాజాగారి రేణుక రాజాగౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారి స్వర్ణలత, ఉప సర్పంచ్ మరియాల స్వామి మరియు రైతులు పాల్గొన్నారు.

# తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర సీఎం సానుకూల స్పందన

- **ముంబైలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం భేటీ**
- **తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లుగా నిర్ణయించాలన్న తెలంగాణ ప్రతిపాదనపై కీలక చర్చలు**
- **మహారాష్ట్రకు, తమ ప్రజలకు ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు సిద్ధమన్న ఫడ్నవీస్**
- **ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల చిరకాల సాగు, తాగునీటి ఆకాంక్షలను వివరించిన సీఎం రేవంత్ రెడ్డి**
- **గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు 152 మీటర్ల ఎత్తు ఎందుకు అవసరమో వివరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు ఆ రాష్ట్ర నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధం**
- **ఆదిలాబాద్‌లో రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి ఊతమని వివరించిన సీఎం**
- **రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటుకు మహారాష్ట్ర సీఎం ప్రతిపాదన**
- **బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై అధ్యయనం.. తదుపరి కార్యాచరణకు రోడ్ మ్యాప్**



**ముంబై అక్టోబర్28( సమయం న్యూస్.)**

ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై చర్చించారు.సమావేశం ప్రారంభంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు.సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్బి చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని తెలిపారు. అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని వివరించారు. ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు.దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నారు. రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం (CWC) తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలన్నారు.ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానంహైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని తెలిపారు. హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానన్నారు.

# పింఛన్‌దారులకు అండగా అల్పాహారం పంపిణీ





- **ఏడాది కాలంగా సేవా కార్యక్రమం కొనసాగింపు**
- **కొడంగల్ నుంచే రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయాలి:**
- **రెండో వార్డు కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ–మధుసూదన్ యాదవ్**

**కొడంగల్ మున్సిపల్, అక్టోబర్,26(సమయం న్యూస్)**

వృద్ధులు,వితంతువులు,దివ్యాంగులకు అండగా నిలుస్తూ బీఆర్ఎస్ పార్టీ కొడంగల్ మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ-మధుసూదన్ యాదవ్ ఏడాది కాలంగా సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాట్లు వారు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పోస్టాఫీస్ వద్ద ఆసరా పింఛన్ల కోసం వచ్చే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పింఛన్ల కోసం పోస్టాఫీస్‌కు వచ్చే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఉదయం నుంచి వేచి ఉండాల్సి వస్తోందని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రతీ నెల 1200 మందికి అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. .ఆసరా పింఛన్ల కోసం వచ్చే వృద్ధులు, వితంతువులు,దివ్యాంగులు ఆకలితో ఇబ్బందులు పడకుండా ప్రతి నెలా కనీసం మూడు రోజుల పాటు పింఛన్‌దారులకు అల్పాహారం అందించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం నుంచే ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని కోరారు. కొడంగల్‌లో ప్రారంభించిన ఈ తరహా సేవా కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని పింఛన్‌దారులకు అల్పాహారం అందించే పథకాన్ని రూపొందిస్తే ఎంతోమంది పేదలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్ కటకం మహేష్ కామ్సన్పల్లి శివ పాల్గొన్నారు.

# నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే ప్రజలకు విముక్తి

- **శారాజీపేటలో దూడల వెంకన్న 37వ వర్ధంతి సభ**

**ఆలేరు, అక్టోబరు 26(సమయం న్యూస్):**

దోపిడీ, పీడన, అన్యాయం, అణిచివేతల నుంచి ప్రజలకు విముక్తి కల్పించేది నూతన ప్రజాస్వామిక విప్లవమేనని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాచకొండ జనార్ధన్ అన్నారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం శారాజీపేటలో కామ్రేడ్ దూడల వెంకన్న 37వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ కార్యదర్శి అయిల యాకయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల్లో ఎర్రజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అధిక వర్షపాతం ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. దూడల వెంకన్న పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, పీడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్.సీత, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా క్రికెట్‌కు మరింత జోష్!

- జనవరి 14 నుంచి డబ్ల్యూపీఎల్ 2027
- ఫిబ్రవరి 7 వరకు ఐదో ఎడిషన్.. అక్టోబర్ 28న ఆటగాళ్ల వేలం
- జట్ల కూర్పుపై ఫ్రాంచైజీల దృష్టి.. రెండేసి టైటిళ్లతో ముంబై, బెంగళూరు




**న్యూఢిల్లీ:** మహిళా క్రికెట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మరో సీజన్‌కు సిద్ధమవుతోంది. మహిళా క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు వేదికగా నిలుస్తున్న ఈ లీగ్ ఐదో ఎడిషన్ 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరగనుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం టోర్నీ షెడ్యూల్‌ను ప్రకటించింది. అయితే మ్యాచ్‌లు నిర్వహించే నగరాల వివరాలను మాత్రం వెల్లడించలేదు. సాధారణంగా మార్చి ఆరంభంలో జరిగే డబ్ల్యూపీఎల్‌ను ఈసారి ముందుగానే నిర్వహించనుండటం విశేషం. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం నిర్వహణపై ఆసక్తి నెలకొంది. అక్టోబర్ 28న కేరళలోని కొచ్చిలో డబ్ల్యూపీఎల్ 2027 ఆటగాళ్ల వేలం జరగనుంది. ఇందులో పాల్గొనే ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లలో అవసరమైన మార్పులు చేసుకుని, బలమైన జట్లను రూపొందించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్, గత సీజన్లలో వారి ప్రదర్శనలు, జట్టుకు అవసరమైన పాత్రలను పరిగణనలోకి తీసుకుని వేలంలో ఎంపికలు చేపట్టనున్నాయి. దీంతో ఏ ఆటగాడికి ఏ జట్టు అవకాశం కల్పిస్తుంది? స్టార్ క్రికెటర్ల కోసం ఫ్రాంచైజీలు ఎంతవరకు ఆసక్తి చూపిస్తాయి? అనే అంశాలు చర్చనీయాంశంగా మారనున్నాయి. ప్రస్తుత జట్లలోని ఆటగాళ్లను కొనసాగించుకునేందుకు బీసీసీఐ సెప్టెంబర్ 28ను చివరి తేదీగా నిర్ణయించింది. ఈ గడువు నేపథ్యంలో ఐదు ఫ్రాంచైజీలు తమ జట్ల కూర్పుపై దృష్టి సారించనున్నాయి. గత సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన ఆటగాళ్లను కొనసాగించుకోవడంతో పాటు, జట్టులోని బలహీనతలను అధిగమించేందుకు అవసరమైన మార్పులు చేపట్టడం కీలకం కానుంది. రిటెన్షన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత వేలంలో ఆటగాళ్ల ఎంపిక ద్వారా జట్ల తుది కూర్పు మరింత స్పష్టతకు రానుంది. కొత్త సీజన్‌లో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగే ఫ్రాంచైజీలకు ఈ ప్రక్రియ కీలకంగా మారనుంది. 2023లో ప్రారంభమైన మహిళల ప్రీమియర్ లీగ్ తక్కువ సమయంలోనే ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. భారత్‌తో పాటు వివిధ దేశాలకు చెందిన ప్రముఖ క్రికెటర్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునేందుకు యువ క్రీడాకారిణులకు కూడా ఈ లీగ్ అవకాశాలు కల్పిస్తోంది. వివిధ దేశాల ఆటగాళ్లు ఒకే జట్టులో కలిసి ఆడటం ద్వారా అనుభవాన్ని పంచుకోవడంతో పాటు ఆటలో కొత్త నైపుణ్యాలను నేర్చుకునే అవకాశం లభిస్తోంది. మహిళా క్రికెట్‌పై అభిమానుల్లో ఆసక్తిని పెంచడం, ఆటగాళ్లకు మెరుగైన పోటీ వాతావరణాన్ని కల్పించడం వంటి అంశాల్లో డబ్ల్యూపీఎల్ కీలక పాత్ర పోషిస్తోంది. డబ్ల్యూపీఎల్ ఇప్పటివరకు నిర్వహించిన నాలుగు ఎడిషన్లలో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు రెండేసి టైటిళ్లు సాధించాయి. 2026 సీజన్‌లో స్మృతి మంధాన నాయకత్వంలోని ఆర్సీబీ రెండోసారి చాంపియన్‌గా నిలిచింది. గత సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలో నిర్వహించారు. ఈ రెండు జట్లు ఇప్పటికే తమ సత్తా చాటగా, మిగిలిన ఫ్రాంచైజీలు కూడా టైటిల్ పోటీలో ముందంజ వేయాలని భావిస్తున్నాయి. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం, జట్ల కూర్పులు పోటీ స్వరూపాన్ని ప్రభావితం చేయనున్నాయి. సాధారణంగా మార్చి ఆరంభంలో జరిగే డబ్ల్యూపీఎల్ ఈసారి జనవరి మధ్యలోనే ప్రారంభం కానుంది. జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు సాగే టోర్నీలో ఐదు జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. మ్యాచ్‌ల వేదికలపై బీసీసీఐ నుంచి మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఆటగాళ్ల వేలం పూర్తయి జట్ల కూర్పులు ఖరారైన తర్వాత కొత్త సీజన్‌పై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. డిఫెండింగ్ చాంపియన్ ఆర్సీబీ టైటిల్‌ను నిలబెట్టుకుంటుందా? ముంబై ఇండియన్స్ మరోసారి ఆధిపత్యం చాటుతుందా? లేక మరో జట్టు విజేతగా అవతరిస్తుందా? అన్నది 2027 సీజన్‌లో తేలనుంది.



# ఏఐటీఏ ఎన్నికల్లోకి సానియా, భూపతి

## లియాండర్ పేస్ అధ్యక్ష ఆశలకు గండి!

### ఎస్ఓఎం ప్రతినిధుల ఎన్నిక కోసం నామినేషన్లు దాఖలు చేసిన సానియా, మహేశ్ భూపతి

**న్యూఢిల్లీ:** భారత టెన్నిస్ వర్గాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశ టెన్నిస్ క్రీడా రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిన దిగ్గజ క్రీడాకారులు సానియా మీర్జా, మహేశ్ భూపతి అఖిల భారత టెన్నిస్ సంఘం పరిపాలనలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వారు ఏఐటీఏలో 'స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ అవుట్‌స్టాండింగ్ మెరిట్' ప్రతినిధుల ఎన్నిక కోసం నామినేషన్లు దాఖలు చేశారు. మరోవైపు, ఏఐటీఏ అధ్యక్ష పదవిని ఆశించిన మరో లెజెండరీ టెన్నిస్ ఆటగాడు లియాండర్ పేస్ అనూహ్యంగా ఈ రేసు నుంచి వెనుకంజ వేయాల్సి వచ్చింది. ఏఐటీఏ సవరించిన నిబంధనల ప్రకారం.. అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే అభ్యర్థి కచ్చితంగా ఎస్ఓఎం ప్రతినిధిగా ఎన్నికై ఉండాలి లేదా గతంలో కార్యవర్గంలో పనిచేసిన అనుభవం ఉండాలి. ఈ రెండు అర్హతలు లేని లియాండర్ పేస్‌కు ఎస్ఓఎం ఎన్నికల ద్వారా అర్హత సాధించడం ఒక్కటే మార్గం. అయితే, ఆయన ఎస్ఓఎం ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయకపోవడంతో అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు. గతంలో బెంగాల్ టెన్నిస్ సంఘం పేస్‌ను అధ్యక్ష అభ్యర్థిగా బలపరిచినప్పటికీ, ఈ నిబంధనల పేచీ కారణంగా ఆయన ఆశలకు గండిపడింది.

**బరిలో ప్రముఖ మాజీ ఆటగాళ్లు:**

ఎస్ఓఎం ప్రతినిధుల ఎన్నికల కోసం సానియా మీర్జా, మహేశ్ భూపతితో పాటు అంకితా భాంబ్రి, ప్రస్తుత డేవిస్ కప్ కోచ్ ఆశుతోష్ సింగ్, విశాల్ ఉప్పల్, గౌరవ్ నాటేకర్, జాన్సీ కృష్ణమూర్తి, శాలిని ఠాకుర చావల సహా మొత్తం 8 మంది మాజీ క్రీడాకారులు నామినేషన్లు దాఖలు చేశారు. క్రీడా సమాఖ్యల నిర్వహణలో అత్యున్నత స్థాయిలో రాణించిన మాజీ ఆటగాళ్లకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నిబంధనల ప్రకారం నలుగురు ఎస్ఓఎం ప్రతినిధులను జనరల్ బాడీకి, ఇద్దరిని ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నుకోనున్నారు. ఈ పరిణామంపై స్పందించిన మహేశ్ భూపతి.. ప్రతి క్రీడా సమాఖ్యకు ఉన్నత స్థాయిలో ఆడిన ఆటగాళ్ల సేవలు ఎంతో అవసరమని తెలిపారు. బ్యాడ్మింటన్‌లో పులేల గోపీచంద్ తీసుకువచ్చిన మార్పులే దీనికి చక్కటి ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. కాగా, నవంబర్ 7న ఎస్ఓఎం ఎన్నికలు జరగనుండగా, నవంబర్ 27న ఏఐటీఏ ప్రధాన ఎన్నికలు నిర్వహించనున్నారు.

# టీ20 క్రికెట్ చరిత్రలోనే సరికొత్త రికార్డు

- తొలి జట్టుగా టీమిండియా!
- అంతర్జాతీయ టీ20ల్లో 200 విజయాలు సాధించిన మొదటి టీమ్‌గా భారత్ రికార్డు
- న్యూజిలాండ్‌పై విజయంలో మెరిసిన తెలుగు ఆణిముత్యాలు తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి




**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 26:** అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో భారత్ మరో అపూర్వమైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 200 విజయాలు సాధించిన తొలి జట్టుగా టీమిండియా చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించడం ద్వారా భారత్ ఈ మైలురాయిని అందుకుంది. కాగా, భారత్‌కు ఇది 300వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కావడం విశేషం. టీమిండియా ఇప్పటివరకు ఆడిన 300 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 200 విజయాలు సాధించగా, 83 మ్యాచ్‌లలో ఓటమి పాలైంది. మరో ఏడు మ్యాచ్‌లు టైగా ముగియగా, 10 మ్యాచ్‌లలో ఎలాంటి ఫలితం తేలలేదు. దీంతో అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 200 విజయాల మైలురాయిని అందుకున్న ప్రపంచంలోని తొలి జట్టుగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ రికార్డు జాబితాలో పాకిస్థాన్ 176 విజయాలతో రెండో స్థానంలో కొనసాగుతుండగా, న్యూజిలాండ్ 135, దక్షిణాఫ్రికా 129, ఇంగ్లండ్ 128, ఆస్ట్రేలియా 127 విజయాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుత టీమిండియా ఫామ్ చూస్తుంటే ఈ విజయాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

**తెలుగు ఆటగాళ్ల అసాధారణ పోరాటం**

న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. మ్యాచ్‌లో భాగంగా 181 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా, ఒక దశలో కేవలం 70 పరుగులకే ఐదు కీలక వికెట్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో పడింది. మ్యాచ్ కివీస్ వశమవుతుందని భావిస్తున్న తరుణంలో, తెలుగు ప్లేయర్స్ తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగిపోయి జట్టును విజయతీరాలకు చేర్చారు. యువ ఆటగాడు తిలక్ వర్మ కేవలం 26 బంతుల్లోనే 51 పరుగులు చేసి అజేయంగా నిలవగా, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కేవలం 13 బంతుల్లోనే 26 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇద్దరూ కలిసి ఏడో వికెట్‌కు అజేయమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారు. చివరి వరకు పట్టువదలక పోరాడిన భారత జట్టు 19.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించి చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది.

# నాలుగేళ్ల తర్వాత రీఎంట్రీ

### తడబడుతున్న భువీకి బౌలింగ్ కోచ్ మోర్కెల్ విలువైన సూచనలు!

### భువనేశ్వర్‌కు మోర్కెల్ అండ : బయటి విమర్శలు పట్టించుకోవద్దని సూచన



**వెల్లింగ్టన్, అక్టోబర్ 26:** న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తడబడుతున్నా.. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అతడికి అండగా నిలిచాడు. బయటి నుంచి వచ్చే విమర్శలు, అంచనాల గురించి ఆలోచించకుండా తన సహజశైలిలో బౌలింగ్ చేయాలని సూచించాడు. ఒక్కో మ్యాచ్‌తో లయ అందుకుంటాడని ధీమా వ్యక్తం చేశాడు. నాలుగేళ్ల విరామం తర్వాత భారత టీ20 జట్టులోకి తిరిగొచ్చిన భువనేశ్వర్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో సాగలేదు. న్యూజిలాండ్‌తో తొలి రెండు టీ20ల్లో తన కోటా ఓవర్లలో వరుసగా 49, 50 పరుగులు సమర్పించుకున్నాడు. 12.37 ఎకానమీతో భారత బౌలర్లలో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా నిలిచాడు. మంగళవారం జరగనున్న మూడో టీ20కి ముందు మోర్కెల్ మీడియాతో మాట్లాడాడు. నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగొచ్చిన ఆటగాడిపై అంచనాలు ఎక్కువగా ఉంటాయని, వాటిని పక్కన పెట్టాలని భువనేశ్వర్‌కు చెప్పినట్లు వెల్లడించాడు. ఐపీఎల్‌లో అతడు అద్భుతంగా రాణించాడని, అయితే అంతర్జాతీయ క్రికెట్ పూర్తిగా భిన్నమని పేర్కొన్నాడు. జాతీయ జట్టులోకి ఎంపికయ్యే ముందు భువనేశ్వర్‌కు సాధన చేసేందుకు నెల రోజుల సమయం మాత్రమే లభించిందని మోర్కెల్ వివరించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో చిన్న పొరపాట్లకూ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని చెప్పాడు. అతడి నైపుణ్యం, అనుభవంపై తనకు నమ్మకం ఉందన్నాడు. కొన్ని మ్యాచ్‌ల్లో స్థిరపడేందుకు సమయం ఇవ్వాలని సూచించాడు. గత రెండు ఐపీఎల్ సీజన్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున భువనేశ్వర్ 45 వికెట్లు పడగొట్టాడు. ఆ జట్టు టైటిల్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. కొత్త బంతితో అతడి బౌలింగ్, అనుభవం జాతీయ జట్టులోకి తిరిగి వచ్చేలా చేశాయి. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలో ఉంది. మూడో మ్యాచ్‌కు వెల్లింగ్టన్‌లో వీచే బలమైన గాలులు సవాల్‌గా మారనున్నాయని మోర్కెల్ అన్నాడు. పరిస్థితులను సాకుగా చూపకుండా, సవాలును ఎదుర్కొనేందుకు జట్టు సిద్ధంగా ఉందని స్పష్టం చేశాడు.

# ఒక్క పరుగు తేడాతో డబుల్ సెంచరీ మిస్..

### అంపైర్ వివాదాస్పద నిర్ణయానికి దేవదత్ పడిక్కల్ బలి!

**లింకన్, అక్టోబర్ 26:** న్యూజిలాండ్‌లోని లింకన్ వేదికగా భారత్ 'ఏ', న్యూజిలాండ్ 'ఏ' జట్ల మధ్య జరుగుతున్న తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ మారథాన్ ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, కేవలం ఒక్క పరుగు తేడాతో (199 పరుగుల వద్ద) తృటిలో డబుల్ సెంచరీని చేజార్చుకున్నాడు. అతను ఔటైన తీరు మైదానంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫీల్డ్ అంపైర్ ఇచ్చిన వివాదాస్పద కాట్ బిహైండ్ నిర్ణయంపై పడిక్కల్ ఆశ్చర్యం, అసంతృప్తి వ్యక్తం చేశాడు. న్యూజిలాండ్ 'ఏ' ఆటగాళ్లు చేసిన అప్పీల్‌లో పెద్దగా బలం లేనప్పటికీ, అంపైర్ వేలు పైకెత్తడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఇన్నింగ్స్ 78వ ఓవర్‌లో కివీస్ బౌలర్ జాక్ గిబ్సన్ వేసిన లెగ్ సైడ్ సాధారణ లెంగ్త్ డెలివరీని ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన పడిక్కల్ ఫ్లిక్ చేయడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో బంతి బ్యాట్‌కు కాకుండా ప్యాడ్‌ను తాకుతూ వెళ్లి వికెట్ కీపర్ మిచెల్ హే గ్లోవ్స్‌లో పడింది. క్రికెట్ నిబంధనల ప్రకారం బంతి బ్యాట్‌ను తాకకుండా కేవలం ప్యాడ్‌ను తాకి వికెట్ కీపర్ వద్దకు వెళితే అది నాటౌట్. ఆ సమయంలో బంతి ప్యాడ్‌కే తగిలిందని పడిక్కల్ గట్టిగా భావించాడు. కానీ అంపైర్ మాత్రం బంతి బ్యాట్‌కు తగిలిందని భావిస్తూ ఔట్‌గా ప్రకటించాడు. అంపైర్ నిర్ణయంతో షాకైన పడిక్కల్.. బంతి బ్యాట్‌కు ఎంత దూరంలో ఉందో, ప్యాడ్‌కు ఎలా తగిలిందో తన హావభావాల ద్వారా అంపైర్‌కు వివరించే ప్రయత్నం చేశాడు. కానీ ఫలితం లేకపోవడంతో నిరాశతో మైదానాన్ని వీడాడు.

**అసలేం జరిగిందంటే..**

దురదృష్టవశాత్తూ పడిక్కల్ డబుల్ సెంచరీ మిస్ అయినప్పటికీ, అతను ఆడిన ఇన్నింగ్స్ చరిత్రలో నిలిచిపోయింది. కేవలం 248 బంతుల్లో 24 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో ఏకంగా 199 పరుగులు బాదాడు. దీంతో ఇండియా 'ఏ' చరిత్రలోనే ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన బ్యాటర్‌గా పడిక్కల్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇండియా 'ఏ' తరఫున పడిక్కల్‌కు ఇది మూడో సెంచరీ కాగా, ఈ ఇన్నింగ్స్ ద్వారానే భారత్ 'ఏ' తరఫున 1000 పరుగుల మైలురాయిని కూడా విజయవంతంగా అధిగమించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 113 పరుగులకే కుప్పకూలగా, న్యూజిలాండ్ 317 పరుగులు చేసి 204 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందుకుంది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లోనూ 10 పరుగులకే యశస్వి జైస్వాల్ (5), కేఎల్ రాహుల్ (4)ల వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన దశలో పడిక్కల్, సాయి సుదర్శన్ జట్టును ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 215 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. సాయి సుదర్శన్ 91 పరుగులు చేయగా.. ఆ తర్వాత యశ్ రాథోడ్ (66), వాషింగ్టన్ సుందర్ (నాటౌట్ 51) అర్ధ శతకాలతో రాణించారు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 488 పరుగుల భారీ స్కోరు సాధించి.. మ్యాచ్‌లో 284 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.






# జైలర్-2.. తెలుగులోనే 100 కోట్లు!

బాక్సాఫీస్ దగ్గర 'తలైవా' సునామీ సృష్టిస్తున్నారు. వయసుతో పనేలేదని, వెండితెరపై తన మేనియా ఎప్పటికీ తగ్గదని నిరూపిస్తూ సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన విశ్వరూపం చూపించారు. ఆయన నటించిన లేటెస్ట్ సెన్సేషన్ 'జైలర్ 2' బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసింది. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌లో ఈ సినిమా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్కును దాటేసి సరికొత్త సంచలనానికి తెరతీసింది. ఒక తమిళ హీరో సినిమా డబ్బింగ్ వెర్షన్ తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ఈ స్థాయిలో విధ్వంసం సృష్టించడం ట్రేడ్ పండితులనే ఆశ్చర్యపరుస్తోంది. చాలామంది డబ్బింగ్ హీరోల సినిమాలు వస్తుంటాయి పోతుంటాయి.. కానీ రజనీకాంత్ వస్తే ఆ వైబ్రేషనే వేరు. తెలుగు ఆడియన్స్ ఆయన్ను ఎంతగా సొంతం చేసుకున్నారో 'జైలర్ 2' వసూళ్లు మరోసారి కళ్లకు కట్టాయి. మొదటి రోజే వచ్చిన పాజిటివ్ టాక్‌తో థియేటర్లన్నీ హౌస్‌ఫుల్ బోర్డులతో దద్దరిల్లిపోయాయి. ఈ వంద కోట్ల మార్క్‌తో రజనీకాంత్ సౌత్ ఇండియాలోనే అరుదైన మైలురాయిని చేరుకున్నారు. కేవలం తెలుగు వెర్షన్ ద్వారానే నాలుగు సార్లు రూ.100 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి అడుగుపెట్టిన ఏకైక తమిళ హీరోగా రికార్డులకెక్కారు. ఇతర భాషా స్టార్లకు తెలుగులో ఒకట్రెండు సినిమాలు ఆడటం చూశాం.. కానీ నాలుగు సార్లు సెంచరీ కొట్టడం ఒక్క రజనీకాంత్‌కే చెల్లిందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్క్రీన్‌పై రజనీ స్వాగ్, నెల్సన్ స్టైలిష్ మాస్ టేకింగ్, థియేటర్లలో ఈలలు వేయించే యాక్షన్ సీన్స్ తెలుగు ప్రేక్షకులకు పూనకాలు తెప్పించాయి. బాక్సాఫీస్ దగ్గర రజనీ ర్యాంపేజ్ ఇంకా కొనసాగుతుండటంతో ఫుల్ రన్‌లో 'జైలర్ 2' మరిన్ని పాత రికార్డులను బద్దలు కొట్టడం ఖాయంగా కనిపిస్తోందని అంటున్నారు.

## మా వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దు: రష్మిక



విజయ్ దేవరకొండతో తన వైవాహిక బంధంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలకు నటి రష్మిక స్పందించారు. తమ వ్యక్తిగత జీవితంపై పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఊహాగానాలు చేయొద్దని, ఎడిట్ చేసిన వీడియోలు, అసంపూర్ణ సమాచారంతో తీర్పులు ఇవ్వడం సరికాదని స్పష్టం చేశారు. ఇటీవల 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో పాల్గొన్న విజయ్.. రష్మిక తనను పెళ్లి చేసుకోమని వందసార్లు అడిగిందని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై విజయ్‌ను విమర్శిస్తూ నెట్టింట పోస్టులు రావడంతో రష్మిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. పెళ్లి విషయంలో నిర్ణయం తీసుకోవడానికి విజయ్ సమయం తీసుకోవడంలో తప్పేమీ లేదని పేర్కొన్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుని, జీవితంలోని కష్టసుఖాలను కలిసి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామో తెలుసుకోవడం ముఖ్యమని రష్మిక అన్నారు. విజయ్‌పై తనకు ఎంతో ప్రేమ ఉందని, ఇద్దరూ పరస్పర అంగీకారంతో ఒకరినొకరు జీవిత భాగస్వాములుగా ఎంచుకున్నామని తెలిపారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు విజయ్ అండగా నిలిచారని, ఇప్పటికీ ఆ మద్దతు కొనసాగుతోందని వెల్లడించారు. ప్రస్తుతం తన జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నానని పేర్కొంటూ, తమ కుటుంబం గురించి తెలియకుండా ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం వేధింపులతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా తనను ఆదరిస్తున్న అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.



# అజిత్ హీరోయిన్‌గా కయాదు లోహార్?

తమిళ స్టార్ హీరో అజిత్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఆయన నటించనున్న 64వ చిత్రానికి 'డేర్ డెవిల్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నవంబర్ 2 నుంచి షూటింగ్ ప్రారంభం కానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. దీంతో ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత అజిత్ మరోసారి దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తో కలిసి పనిచేయనున్నారు. నిర్మాతల విషయంలో నెలకొన్న సందిగ్ధత, అజిత్ కార్ రేసింగ్ కార్యక్రమాల కారణంగా ఈ సినిమా ఆలస్యమైంది. ఈ చిత్రానికి అజిత్ స్వయంగా నిర్మాతగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మొదట హీరోయిన్‌గా శ్రీలీల పేరు వినిపించినప్పటికీ, ఆమె ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా ఆమె స్థానంలో కయాదు లోహార్ నటించనున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. అయితే చిత్ర బృందం దీనిపై అధికారికంగా స్పందించలేదు. మరోవైపు అధిక్ రవిచంద్రన్ తన సినిమాల్లో హీరోయిన్ పాత్రకు 'రమ్య' అనే పేరు పెట్టడం ప్రత్యేకతగా కొనసాగుతోంది. 'డేర్ డెవిల్'లోనూ ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తారా? కయాదు లోహార్ హీరోయిన్‌గా ఖరారవుతారా? అన్నది అధికారిక ప్రకటన తర్వాతే స్పష్టత రానుంది.




# రవిబాబు హారర్ సినిమాలో బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్!

టాలీవుడ్‌లో ఓ క్రేజీ కాంబినేషన్ తెరపైకి వచ్చింది. వైవిధ్యమైన కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రవిబాబు.. ఓ హారర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అదే నిజమైతే దాదాపు 17 ఏళ్ల తర్వాత కంగనా మళ్లీ తెలుగు తెరపై కనిపించనున్నట్టే! విభిన్నమైన కథాంశాలు, విలక్షణమైన మేకింగ్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడం దర్శకుడు రవిబాబు శైలి. ఇటీవల 'రేజర్'తో వార్తల్లో నిలిచిన ఆయన.. ఇప్పుడు హారర్ జానర్‌లో మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్టులో కంగనా రనౌత్ నటించనున్నారనే ప్రచారం ఈ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, చిత్రీకరణ కూడా రహస్యంగా సాగుతోందని కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తల్లో నిజమెంత? కంగనా నిజంగానే రవిబాబు సినిమాలో నటిస్తున్నారా? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు అధికారిక సమాధానం లేదు. కంగనా రనౌత్‌కు తెలుగు ప్రేక్షకులతో గతంలోనే పరిచయం ఉంది. ప్రభాస్ కథానాయకుడిగా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏక్ నిరంజన్'లో ఆమె కథానాయికగా నటించారు. ఆ సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయమైన కంగనా.. ఆ తర్వాత మరో తెలుగు చిత్రంలో కనిపించలేదు. ఇప్పుడు రవిబాబు హారర్ సినిమాలో ఆమె నటిస్తున్నారనే ప్రచారం నిజమైతే, దాదాపు 17 ఏళ్ల విరామం తర్వాత టాలీవుడ్‌లోకి ఆమె రీఎంట్రీ ఇచ్చినట్లవుతుంది. బాలీవుడ్‌లో తనదైన నటనతో గుర్తింపు సంపాదించిన కంగనా.. హారర్ కథలో ఎలాంటి పాత్రలో కనిపిస్తారనే అంశం ఆసక్తికరంగా మారుతుంది. కంగనా రనౌత్ తదుపరి చిత్రాల గురించి ఇప్పటికే పలు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె ఓ తెలుగు సినిమాలో నటించనున్నారనే ప్రచారం అభిమానుల్లో చర్చకు దారితీసింది. అయితే రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్నట్లు చెబుతున్న హారర్ చిత్రానికి సంబంధించి కంగనా ఎంపిక, కథ, పాత్ర, షూటింగ్ వివరాలపై అధికారిక సమాచారం అందుబాటులో లేదు. ఓవైపు విలక్షణ దర్శకుడు రవిబాబు.. మరోవైపు బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్.. ఈ ఇద్దరి కలయిక నిజమైతే సినిమాపై సహజంగానే భారీ ఆసక్తి ఏర్పడుతుంది. కానీ ప్రస్తుతం ఈ కాంబినేషన్‌పై వస్తున్న వార్తలకు అధికారిక ధ్రువీకరణ లేదు. కంగనా బృందం లేదా చిత్రబృందం నుంచి ప్రకటన వెలువడితేనే ఈ ప్రాజెక్టుపై స్పష్టత రానుంది. అప్పటివరకు ఈ క్రేజీ కాంబినేషన్‌ను ఆసక్తికరమైన ప్రచారంగానే చూడాలి.

PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA**, 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267. www.samayam.net**, PHONE:**7036644111, 9490140565**

# డా. బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డుకు అప్పలి శ్రీనివాసులు ఎంపిక

- **ప్రజా సంక్షేమ సంఘం నాయకుల సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు**




**చేవెళ్ళ, అక్టోబర్ 26 (సమయం న్యూస్):** షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, ప్రజా సంక్షేమ సంఘం నాయకులు అప్పలి శ్రీనివాసులు ప్రతిష్ఠాత్మక డా. బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ (BSA) ఆధ్వర్యంలో ఏటా జాతీయ స్థాయిలో అందజేసే ఈ అవార్డుకు ఆయన ఎంపిక కావడం పట్ల షాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.హైదరాబాద్ లోని బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో BSA జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అప్పలి శ్రీనివాసులు తన సెలక్షన్ లెటర్ను ఘనంగా అందుకున్నారు. ఈ అవార్డును రానున్న నవంబర్ 15వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరగనున్న 20వ జాతీయ మహాసదస్సులో కేంద్ర మంత్రులు, ప్రముఖ మేధావుల సమక్షంలో ప్రధానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.నిస్వార్థ సేవకు నిదర్శనం అప్పలి శ్రీనివాసులు:సమాజ అభ్యున్నతి కోసం, అణగారిన వర్గాల సంక్షేమం కోసం, ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో బహుజన సాహిత్య అకాడమీ ఈ జాతీయ అవార్డులను అందజేస్తోంది.అప్పలి శ్రీనివాసులు గత అనేక సంవత్సరాలుగా ప్రజా సంక్షేమ సంఘం, అంబేద్కర్ సంఘ అధ్యక్షులుగా, బాబు జగ్జీవన్ రామ్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా, విశేష సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మద్యానికి వ్యతిరేకంగా చైతన్య సదస్సులు నిర్వహించడం వంటి ఎన్నో కార్యక్రమాల్లో ఆయన ముందుంటారు.ముఖ్యంగా తాళ్లపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చే వ్యక్తిగా ఆయనకు మంచి పేరు ఉంది. అణగారిన వర్గాల హక్కుల కోసం, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చేయడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయం. ఈ నిస్వార్థ సేవలకు గుర్తింపుగానే ఈ జాతీయ అవార్డు వరించింది.ఈ కార్యక్రమంలో BSA రాష్ట్ర నాయకులు మల్లగళ్ల మల్లేష్, కోటేశ్వరరావు, విజయ్ కుమార్, విష్ణువర్ధన్, అవార్డుల ఎంపిక కమిటీ సభ్యులు, ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు చౌక్కంపేట ఆంజనేయులు, పలువురు సామాజిక ఉద్యమకారులు పాల్గొన్నారు.అవార్డుకు ఎంపికైన అప్పలి శ్రీనివాసులును పలువురు ప్రముఖులు, గ్రామస్తులు ఘనంగా అభినందించారు. డా. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుకు కృషి చేయాలి

- **మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్**

**హన్మకొండ/వడ్డేపల్లి, అక్టోబర్ 26 (సమయం న్యూస్)**

అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు.60వ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో సోమవారం ఆయన పట్టభద్రులను కలిసి ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం18ను అందజేశారు. అర్హులైన వారంతా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని వినయ్ భాస్కర్ సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులందరూ నమోదు చేసుకునేలా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల డివిజన్ ఇన్‌ఛార్జి రఘు, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ బాధ్యుడు జనార్ధన్, డివిజన్ సీనియర్ నాయకుడు తోట నవీన్, విజయపాల్ కాలనీ బీఎల్ఏ విష్ణు, టీచర్స్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



# మల్కాజిగిరి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ

- **GOC శ్రీనివాస్ VSMతో మర్రి రాజశేఖర్ రెడ్డి భేటీ.. సబ్‌వే, రహదారులు, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి**

**బొల్లారం, అక్టోబర్ 26 (సమయం):**

మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో సోమవారం బొల్లారంలోని తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా ప్రధాన కార్యాలయంలో జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (GOC) శ్రీనివాస్ VSMను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన అనుమతులు, సహకారం అందించాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు.సఫిల్‌గూడ సబ్‌వే పనులకు అడ్డంకులు తొలగించాలిసఫిల్‌గూడ లిమిటెడ్ హైట్ సబ్‌వే (LHS) నిర్మాణ పనులకు ఆర్మీ భూముల పరిధిలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సబ్‌వే నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు.AOC పరిధిలో రహదారుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలిAOC పరిధిలో అదనపు రహదారుల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, పనులు ప్రారంభించేందుకు అవసరమైన వర్క్ స్టార్ట్ పర్మిషన్ మంజూరు చేయాలని కోరారు. రహదారుల నిర్మాణం పూర్తయితే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.
కౌకూర్ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించాలికౌకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూమికి, ఆర్మీ భూములకు మధ్య ఉన్న సరిహద్దు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేసి, పనులు చేపట్టేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.యాప్రాల్‌లో ప్రజా రవాణా సమస్య పరిష్కారానికి విజ్ఞప్తియాప్రాల్ ప్రాంతంలో ప్రజా రవాణా సౌకర్యాల మెరుగుదలకు అవసరమైన అనుమతులు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చి, 66 సంవత్సరాల చరిత్ర కలిగిన వలేరియన్ గ్రామానికి సంబంధించిన రవాణా సమస్యలను జీఓసీ దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, రవాణా సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

# సేంద్రియ వ్యవసాయమే మేలు

- **రైతులకు వ్యవసాయ సంచాలకులు డా. బి. గోపి ఐఏఎస్ సూచన**

**హైదరాబాద్ అక్టోబర్26( సమయం న్యూస్)**

ఎల్‌నినో నేపథ్యంలో వరి వద్దు, ఆరుతడి పంటలే ముద్దు; ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా దుబ్బచెర్లలో క్షేత్రస్థాయి పర్యటనపప్పుజాతి, నూనెగింజల పంటలను సాగు చేయాలిపశుగ్రాసం కొరత రాకుండా స్వల్పకాలిక పశుగ్రాస పంటలు సాగు చేయాలని పిలుపు ఖేత్ బచావో అభియాన్ – సాగు భూమి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐఏఎస్ సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దుబ్బచెర్ల గ్రామంలో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొని, రైతులతో నేరుగా మాట్లాడారు.ఈ వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గాయని, భూగర్భ జలాలు అడుగంటాయని సంచాలకులు తెలిపారు. రాబోయే ఏడెనిమిది నెలల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే సూచనలున్నందున, రైతులు ఈ యాసంగిలో వరి సాగు చేయవద్దని కోరారు. తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే ఆరుతడి పంటలను మాత్రమే ఎంచుకోవాలని, పప్పుజాతి, నూనెగింజల పంటలను సాగు చేయాలని సూచించారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలని, అంతర్జాతీయంగా గిరాకీ ఉన్న ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని రైతులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉండటం వల్ల ఇక్కడి రైతులు పండించిన కూరగాయలకు అధిక డిమాండ్ ఉంటుందని, అధిక గిరాకీ ఉన్న పంటలు పండిస్తే మంచి ఆదాయం పొందవచ్చని వివరించారు.ప్రస్తుత పరిస్థితుల్లో పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, పశుగ్రాసం కొరత రాకుండా స్వల్పకాలిక పశుగ్రాస పంటలు సాగు చేయాలని కోరారు.పంట సాగులో నేల సంరక్షణే అత్యంత కీలకమని సంచాలకులు అన్నారు. నేలను కాపాడుకుంటేనే దిగుబడులు, రైతు ఆదాయం పెరుగుతాయని, భావితరాలకు సాగుయోగ్యమైన భూమిని అందించగలమని చెప్పారు. సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన మేరకే వాడుతూ, క్రమంగా వాటిపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం రైతులకు, నేలకు మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. వీలైతే ప్రతి రైతు కనీసం ఒక ఎకరంలో రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం చేయాలని, సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, పండ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని తెలిపారు.రైతు క్షేత్రం సందర్శనసమావేశం అనంతరం సంచాలకులు గ్రామానికి చెందిన రైతు శ్రీ సీతారాములు క్షేత్రాన్ని సందర్శించారు. సొంతంగా 10 ఎకరాలు, కౌలుకు తీసుకున్న 15 ఎకరాలు కలిపి మొత్తం 25 ఎకరాల్లో ఆయన ఈత, ఆయిల్ పామ్, వరి, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. పంటల పరిస్థితిని పరిశీలించిన సంచాలకులు, సాగు విధానాలు, ఎదురవుతున్న సమస్యల గురించి రైతుతో ముచ్చటించి అడిగి తెలుసుకున్నారు.విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రతిజ్ఞ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి నవంబర్ 1 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోంది. 'సమగ్రతతో సుసంపన్నత' అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ వారోత్సవాల ఉద్దేశం అవినీతి నిర్మూలన, పారదర్శకత, నైతిక విలువలను పెంపొందించడం. ఇందులో భాగంగా సంచాలకులు, అధికారులు, రైతులతో కలిసి సమగ్రత ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి సుజాత, కృషి విజ్ఞాన కేంద్రం సంచాలకులు డా. చంద్రకాంత్, ఉద్యాన విషయ నిపుణులు శ్రీ శ్రీకృష్ణ, పశువైద్య విషయ నిపుణులు డా. సుధీర్, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి డా. దిలీప్, మహేశ్వరం సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారి, సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు పేదల హక్కు అధికార పార్టీ కార్యకర్తల సొత్తు కాదు

- **పులిగిల్ల గ్రామపంచాయతీ ముందు సిపిఎం ధర్నా.**

**వలిగొండ అక్టోబర్ 26 (సమయం న్యూస్)**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని ఆపాలని అర్హులైన పేదలందరికీ ఇండ్లను చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి,సీనియర్ నాయకులు కళ్లెం సుదర్శన్ రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి లు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో సోమవారం రోజున ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో జరుగుతున్న అవినీతి,అక్రమాలను నిర్వహించాలని అధికార పార్టీ రాజకీయ జోక్యాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సిపిఎం పులిగిల్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి సైదులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి, సుదర్శన్ రెడ్డి, వెంకటరెడ్డి లు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్ల పథకం, రాజకీయ జోక్యానికి వేదికగా మారిందన్నారు. అర్హతలు, పేదరికం, నిజమైన అవసరాలను ప్రాతిపదికగా తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన ప్రభుత్వం,రాజకీయ సిఫార్సులకు తలొగ్గితే పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వ పెద్దల దయాదాక్షిణ్యాలు కాదని అర్హులైన పేదల హక్కని అన్నారు. గ్రామాల్లో నిజంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని కూలీలు, వ్యవసాయ కార్మికులు, నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయంలో రాజకీయ పలుకుబడి,పార్టీ అనుబంధాలే ప్రామాణికంగా మారితే పథకం అసలు లక్ష్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి 80 ఇండ్లను మంజూరు చేయాలని ,లబ్ధిదారుల ఎంపికను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని అన్ని రాజకీయ పార్టీలతో కూడిన కమిటీని నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని వలిగొండ టు కాటేపల్లి రోడ్డు బావుల వద్ద ప్రమాదకరంగా లో ఉన్న స్థలాల్లో హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలని గ్రామంలోని చింతల కింద అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. పేదల పేరుతో పథకాలు ప్రకటించి, రాజకీయ ప్రయోజనాల కోసం వాటిని ఉపయోగించుకోవడాన్ని సహించేది లేదని అర్హులైన పేదలకు న్యాయం జరిగే వరకు, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత సాధించే వరకు ప్రజలను సమీకరించి ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. శంకరయ్య, బాబు,ఈర్ల రమేష్,దొడ్డి యాదగిరి, నముద్రిపాల్,భానుపాల్గొన్నారు.

## బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**సిరిసిల్ల అక్టోబర్28( సమయం న్యూస్)** సిరిసిల్లలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో "సురక్షిత్ బచ్పన్ అభియాన్" ప్రారంభమైంది. బాలల హక్కులు, మంచి స్పర్శ-చెడు స్పర్శ, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శ్రీ పి. లక్ష్మణాచారి మాట్లాడుతూ, బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పాఠశాలలు పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి. సుష్మిత, లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.



## పట్టభద్రుల ఓటరు నమోదు

- **అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు కావాలి**

**భద్రాద్రి కొత్తగూడెం:అక్టోబర్26( సమయం న్యూస్)**

అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. నవంబర్ 6లోగా ఫారం 18 దరఖాస్తులు సమర్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ప్రతి కళాశాలలో నోడల్ అధికారిని నియమించి, అర్హులైన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది వివరాలను సేకరించాలని తెలిపారు. ఫారం18 ద్వారా ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని, ఎన్నికల విభాగంతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

- **ఎంపికల్లో 60 మంది క్రీడాకారిణులు: క్రీడా దుస్తుల పంపిణీ**

**ఆలేరు, అక్టోబరు 26(సమయం న్యూస్):**

ఆలేరు పట్టణంలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో 73వ సీనియర్ మహిళల జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా నలుమూలల నుంచి సుమారు 60 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారిణులు ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జరిగే 73వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ బుర్ర మహేందర్ యాదవ్ క్రీడాకారిణులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం వారికి క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గంధమల్ల కుమార్, జాయింట్ సెక్రటరీ సింగం విజయ్, పూల చంద్రకుమార్, మంగళగిరి నరేశ్, జాతీయ రిఫరీ మరాటి లింగస్వామి, ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు పారానంది రాహుల్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ

- **కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, అక్టోబర్ 26( సమయం న్యూస్)**

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంగీతతో కలిసి నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులు అందాయి. సంగారెడ్డి డివిజన్ నుంచి 9, నారాయణఖేడ్ నుంచి 2, జహీరాబాద్ నుంచి 3, కలెక్టరేట్ ప్రజావాణికి 35 ఫిర్యాదులు వచ్చాయి. అందోల్ డివిజన్ నుంచి ఫిర్యాదులు అందలేదు.



## కులాంతర వివాహ ప్రోత్సాహక బాండ్ల పంపిణీ

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 26:( సమయం న్యూస్)** ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 16 మంది కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం మంజూరు చేసిన ప్రోత్సాహక ఫిక్స్డ్ బాండ్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం అందజేశారు. ఒక్కో జంటకు రూ.2.50 లక్షల విలువైన ఫిక్స్డ్ బాండ్ చొప్పున జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకానికి దరఖాస్తు చేసుకున్న జంటలకు ఈ బాండ్లు మంజూరయ్యాయి.కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## రూ.3.14 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన పరిగి ఎమ్మెల్యే






- డాక్టర్. టి.రామ్మోహన్ రెడ్డి

**పరిగి నియోజకవర్గం,అక్టోబర్,26(సమయం న్యూస్)**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లోని గండీడ్ మండల కేంద్రంలో రూ.314.54 లక్షల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా ప్రారంభించిన ఈ సబ్‌స్టేషన్, జంగంరెడ్డిపల్లి గ్రామాలకు మెరుగైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో ఆయా ప్రజలు, రైతులకు విద్యుత్ సరఫరా పరంగా మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రతి గృహానికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయ రంగానికి కూడా విద్యుత్ సరఫరా చేస్తూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులుశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా గూడూరు సందీప్ జన్మదిన వేడుక..

- శాలువాతో సత్కరించిన డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి

**నర్సంపేట, అక్టోబర్ 26 (సమయం న్యూస్)**

బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ జన్మదినం సందర్భంగా సోమవారం బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సందీప్‌తో కలిసి కేక్ కట్ చేసి, శాలువా కప్పి సత్కరించారు.గూడూరు సందీప్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజాసేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, నర్సంపేట పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, సమన్వయం పార్టీకి బలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**దౌల్తాబాద్ మండలం, అక్టోబర్,26(సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లా

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొడంగల్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఏ. తిరుపతిరెడ్డి కొడంగల్ స్పెషల్ కడ వెంకట్ రెడ్డి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వెంకటస్వామి డిప్యూటీ ఎమ్మార్వో వివిధ శాఖల అధికారులు స్థానిక సర్పంచ్ బత్తుల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు వెంకట్రావు జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి జంగం వీరన్న,మాజీ ఎంపిటిసి మంజుల దస్తప్ప, వివిధ గ్రామాల సర్పంచులు వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## ఎల్ నినో ప్రభావంపై ముద్దాపురం గ్రామపంచాయతీ లో గ్రామసభ

**వలిగొండ అక్టోబర్ 26 (సమయం న్యూస్)**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ముద్దాపురం గ్రామంలో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కిరణ్ పంచాయతీ కార్యదర్శి మత్స్యగిరి మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. గ్రామంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించడం వ్యవసాయ రంగానికి అవసరమైన నీటిని పొదుపుగా వినియోగించుకోవడం,రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు నీటి సంరక్షణకు ఉపయోగపడే పనులను గుర్తించి చేపట్టాలని అన్నారు.గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇప్పటినుంచే తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సామ సరస్వతి రాంరెడ్డి, ఉపసర్పంచ్ బడక శ్రీను, వార్డ్ సభ్యులు బత్తుల బిక్షపతి, గూడూరు సుగుణ, శ్యామల చైతన్య, అంగన్వాడి టీచర్ పి సునీత, ఆశ కార్యకర్త గుంటోజు రామలీల, కరెంట్ హెల్పర్ నరసింహ గ్రామ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో 181 అంగన్వాడీ టీచర్ పోస్టులకు అభ్యంతరాల స్వీకరణ

**హైదరాబాద్ అక్టోబర్26( సమయం న్యూస్,)**

హైదరాబాద్ జిల్లా పరిధిలోని చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 181 మెయిన్ అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ తెలిపారు.నోటిఫికేషన్ నం. 1170II/E.O.II/2026కు దరఖాస్తు చేసి, ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఏవైనా అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే అక్టోబర్ 27 నుంచి 31, 2026 వరకు ఆధారాలతో సహా రాతపూర్వకంగా సమర్పించాలి.అభ్యంతరాలను అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సంబంధిత ఐసీడీఎస్ (CDPO) కార్యాలయంలోనే అందజేయాలి. అక్టోబర్ 31 తర్వాత వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోబోమని జిల్లా సంక్షేమ అధికారి స్పష్టం చేశారు.

## దుమ్ముగూడెంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో బైక్ ర్యాలీ

**భద్రాద్రి కొత్తగూడెం ,అక్టోబర్,26( సమయం న్యూస్)**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా దుమ్ముగూడెంలో పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా 150 మందికి హెల్మెట్లు పంపిణీ చేసి, పోలీసు అమరవీరుల త్యాగాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు భద్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ నుంచి దుమ్ముగూడెం క్రాస్ రోడ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సామాజిక బాధ్యతపై చైతన్యం కల్పించడమే కార్యక్రమం లక్ష్యమని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో భద్రాచలం డీఎస్పీ పోలీసు, టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి
- సమయపాలన పాటించాలని అధికారులకు ఆదేశం – కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, అక్టోబర్ 26( సమయం న్యూస్)**



ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 121 ఫిర్యాదులను కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, మున్సిపల్ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ప్రారంభ సమయం ఉదయం 10.30 గంటలకే అధికారులు హాజరై సమయపాలన పాటించాలని ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా కార్యస్థానం విడిచి వెళ్లవద్దని స్పష్టం చేశారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని, మండల ప్రత్యేక అధికారులు అవగాహన సదస్సుల్లో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు.

## ఎల్‌నినో, తక్కువ వర్షపాతంపై యువత చైతన్యం కావాలి

- విద్యార్థులకు వ్యాసరచన పోటీలు: నీరు, ఆహారం, విద్యుత్తు పొదుపుపై ప్రతిజ్ఞ

**ఆలేరు, అక్టోబర్ 26(సమయం న్యూస్):**

ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం కారణంగా ఎదురయ్యే సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నీరు, ఆహారం, విద్యుత్తును పొదుపుగా వినియోగించుకునేలా యువతను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా మెగా సుభాష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ ఏటీసీ, ఐటీఐ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వాతావరణ మార్పులు, తక్కువ వర్షపాతం వల్ల వ్యవసాయం, తాగునీటి లభ్యత, ప్రజల జీవనంపై పడే ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని వనరుల సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం, ఆహార వృథాను అరికట్టడం, విద్యుత్తును అవసరమైనప్పుడే ఉపయోగించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రకృతి వనరుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా నీరు, ఆహారం, విద్యుత్తును పొదుపు చేయడంతో పాటు అందు



బాటులో ఉన్న వనరులను సంరక్షిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణ, వనరుల పొదుపుపై యువతలో బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, మండల యువజన సంఘాల సమితి అధ్యక్షుడు తాళ్లపల్లి మహేశ్ పాల్గొన్నారు.

## బాలికలకు అందమైన బాల్యాన్ని బహుమతిగా అందించాలి

- బాలికల బాల్యానికి భద్రత.. ఎదుగుదలకు భరోసా..
- బాలికలకు భద్రమైన బాల్యం అందించడం అందరి బాధ్యత – డాక్టర్ అనితా రెడ్డి

**హనుమకొండ, అక్టోబరు 26 (సమయం న్యూస్)**



బాలికలు, మహిళల విద్య, రక్షణ, అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తోడ్పాటు అందించాలని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ స్వధార్ హోమ్‌ను సందర్శించిన ఆమె అక్కడి మహిళలు, బాలికలతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగని, బాలికలకు విద్య అందించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. నేటి కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారి ఎదుగుదలకు తల్లిదండ్రులతో పాటు సమాజం కూడా అండగా నిలవాలని సూచించారు. బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకొని, స్వతంత్రంగా ఆలోచించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.పౌష్టికాహారం, విద్యా ప్రాధాన్యం, మహిళా సాధికారతపై బాలికలు, మహిళలకు అవగాహన కల్పించారు. ఆదరణకు నోచుకోని బాలికలు, మహిళలకు ఆశ్రయం, విద్య, రక్షణ, ఆత్మవిశ్వాసం కల్పించడంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. తల్లిదండ్రులు బాలికలకు బాల్యవివాహాలు చేయకుండా, బాలకార్మికులుగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.బాలల హక్కుల పరిరక్షణకు గ్రామ, మండల, జిల్లా స్థాయుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి బాలికకు భద్రతతో కూడిన అందమైన బాల్యాన్ని అందించడం సమాజం బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలు, పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వధార్ హోమ్ సిబ్బంది, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ సమరశంఖం

- ఓట్ బచావో–దేశ్ బచావో' మూడో దశ కార్యాచరణ ఖరారు
- డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి

**హనుమకొండ, అక్టోబరు 26 (సమయం న్యూస్)**

ఓటర్ల జాబితాలో అక్రమాలపై పోరాటాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ సిద్ధం చేసింది. ఏఐసీసీ పిలుపు, టీపీసీసీ ఆదేశాల మేరకు చేపట్టిన 'ఓట్ బచావో-దేశ్ బచావో' ఉద్యమ మూడో దశ కార్యక్రమాలపై హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ఉద్యమ కార్యాచరణను వివరించారు.ఏఐసీసీ పరిశీలకుడు కేబీఆర్ నాయుడు, టీపీసీసీ సమన్వయకర్త అరికెల నర్సారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కె.ఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.మీడియా సమావేశంలో కేబీఆర్ నాయుడు, ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని అధికార పక్షం స్వార్థ ప్రయోజనాల కోసం ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని, ఓటర్ల జాబితాలో అవకతవకలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. దేశ ప్రజల భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని, ఆయన ప్రధానమంత్రి అవుతారని కేబీఆర్ నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యమ తొలి రెండు దశలను పూర్తి చేసుకున్న నేపథ్యంలో మూడో దశలో జిల్లాలోని ప్రతి బ్లాక్, బూత్, గ్రామ స్థాయికి కార్యక్రమాలను విస్తరించనున్నట్లు నాయకులు తెలిపారు. అన్ని నియోజక




వర్గాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్లతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఏఐసీసీ డిజిటల్ వేదిక 'ఓట్ రక్షక్' పోర్టల్ వినియోగంపై బూత్ ఏజెంట్లు, వాలంటీర్లకు శిక్షణ ఇస్తామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాలను పరిశీలించి, అక్రమంగా తొలగించిన లేదా మార్పులకు గురైన ఓట్ల వివరాలను ధ్రువీకరించి, సంతకాలతో కూడిన నివేదికలు సిద్ధం చేస్తామని చెప్పారు.గ్రామాల్లో ఓటర్లు, గ్రామ పెద్దలు, యువత, పంచాయతీ ప్రతినిధులతో 'గ్రామ చౌపాల్' పేరిట రచ్చబండ తరహా సమావేశాలు నిర్వహించి, ఓటు హక్కు పరిరక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తామన్నారు.నవంబరు 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న జాతీయ ర్యాలీతో పాటు, నవంబరు 25, 26 తేదీల్లో చేపట్టనున్న 'దిల్లీ చలో' కార్యక్రమాలకు జిల్లా నుంచి మద్దతు తెలుపుతామని నాయకులు పేర్కొన్నారు.సమావేశంలో టీపీసీసీ నాయకులు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎండీ అయ్యూబ్, గ్రేటర్ వరంగల్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, మండల, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.